# భాగవత గాధలు



## 1. త్రివిక్రమ విజయం

## 2. భార్గవరాముని ఉదంతం


మూలం :

**బమ్మెర పోతనామాత్యుడు**

(అనుసరణ) రచన :

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.

శ్రీరస్తు          శుభమస్తు          అవిఘ్నమస్తు

# 1. త్రివిక్రమ విజయం

మూలం :

**బమ్మెర పోతనామాత్యుడు**

(అనుసరణ) రచన :

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.



**త్రివిక్రమ విజయం**

మొదటి ప్రచురణ

మే 2009

(అనుసరణ) రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ఫ్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109



## ముందుమాట

మన పురాణేతిహాస ప్రకారం దేవదానవులు అక్క చెల్లెళ్ళయిన అదితికి దితికి, కశ్యప మహాముని ద్వారా జన్మించిన సంతానమే. వారు జన్మించినప్పుడు వారి వారి తల్లుల మనోభావాలనుంచే బిడ్డలకు దైవత్వం అసురత్వం కలిగాయి. దైహికంగా వారంతా ఒక తండ్రి బిడ్డలే.

పరమాత్ముడైన శ్రీమన్నారాయణునికి అంతా సమానమే. అయినప్పటికీ ఆయన దైత్యాంతకుడై ఆదిత్యులను కాపాడాడు. దేవతలు గర్వంతో అహంకరించినప్పుడు ఆయనే వారిని దానవుల చేతిలో పరాజితులై దేశాలు పట్టి పోయేట్లు చేశాడు.

హిరణ్యాక్ష, హిరణ్యకసిపుల్ని గతజన్మలో వారు తన ప్రియతమ ద్వారపాలురయినా సంహరించాడు. ఆ హిరణ్యకశిపుని కొడుకైన ప్రహ్లాదుణ్ణి అడుగడుగుకీ ఆదుకున్నాడు.



"త్రివిక్రమ విజయం" ఇతివృత్తం ఇది. ఆ ప్రహ్లాదుని మనుమడు బలి తన గురువు శుక్రాచార్యుడి కృపతో గొప్ప యాగం చేసి బలోపేతుడై దేవతల్ని పారద్రోలుతాడు స్వర్గం నుంచి. రోదిస్తున్న వారి తల్లి అదితిని ఓదార్చి ఆమె భర్త కశ్యపుడు శ్రీహరి కోసం వయోభక్షణ చేస్తూ పన్నెండు దినములు ఒక వ్రతం చేసి ఆయన దర్శనం పొంది ఆయన్ని తన గర్భంలో జన్మించి బలిపీడ నివారించమని కోరింది.

శ్రీహరి ఆమెకు వామనుడై పొట్టి బాలునిగా జన్మించి వెంటనే నడయాడు బాలుడైనాడు. కశ్యపుడు అతనికి వడుగు చేశాడు. ఆ వటువు బలివద్దకు వచ్చి భిక్షగా మూడు అడుగుల స్థలం అడుగుతాడు. గురువు శుక్రాచార్యుడు వారిస్తున్నా వినకుండా, వామనునికి దానం ఇస్తాడు బలి.

అంత ఆ పొట్టివాడు త్రివిక్రముడై, అనంతుడై, భూలోకం ఒక అడుగుతోను, భువర్లోక సువర్లోకాలు

(స్వర్గం) ఇంకొక అడుగుతోను ఆక్రమిస్తాడు. బలిని బంధించి ఇప్పుడు మూడవ పాదానికి చోటు చూపించమంటాడు త్రివిక్రముడు. ఓటమినంగీకరించని బలి తన తలపై ఆ పాదం పెట్టమంటాడు.

అప్పుడు ప్రహ్లాదుడక్కడికి వచ్చి శ్రీహరిని దయ జూపమంటాడు. బలి భార్య శ్రీహరిని పతిభిక్ష కోరుతుంది. ప్రసన్నుడైన శ్రీహరి తిరిగి వామన రూపం ధరించి బలికి సుతులలోకం ప్రసాదించి తనే స్వయంగా బలికి కాపు ఉంటానంటాడు. శుక్రాచార్యుడితో యాగం పూర్తిచేయిస్తాడు శ్రీహరి. ఇది ఈ రచన సంక్షిప్త ఇతివృత్తం.

నాకు బమ్మెర పోతనగారిపై ఎనలేని అనురాగం, భక్తి. ఆయన రచనల్లోని సునిసితత్వం, భక్తి పరాకాష్టత సరళ భాష పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. నాకు చేతనయినంత వరకు ఆ మాధుర్యం పరావర్తనం చెందించగలిగాను.



తెలుగు సంస్కృత భాషలలో ఏమాత్రం పాండిత్యం లేని నేను కేవలం నాలో కలిగే భావతరంగాల వల్ల వ్రాస్తాను. నేను వ్రాసేది పాండిత్యంతో కాదు ప్రేరణతో.

నేను వ్రాసింది ఒక పదినిముషాల తరువాత నాకే గుర్తు ఉండని విచిత్రమైన సమస్య నాది. మనకర్థమయే భాషలో 'టెంపరరీ మెమొరీలాస్' అంటారు. ఒక పది నిముషాల క్రితం నేను వ్రాసింది నాకు గుర్తుండదు. దేని గురించి వ్రాశానో గుర్తు ఉంటుంది కాని ఏమి వ్రాసానో గుర్తు ఉండదు. అందువల్ల నేను వ్రాసింది నేనే వ్రాసానని కూడ నిరూపించుకోలేను.

ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను.

పోతనగారి "ఆదిన్ శ్రీ సతికొప్పుపై తనువుపై...." అనే పద్యం శార్ధూల వృత్తములో ఉన్నది. దానిని నేను వ్రాసినప్పుడు "కలిముల రాణి కొప్పుపయి...." అని చంపకమాల వృత్తంలోకి మార్చాను. చాలవరకు భావం



యధాతథంగా ఉండేందుకు ప్రయత్నించాను. ఇంతవరకు బాగానే వుంది కాని ఇప్పుడు ఏం వ్రాసావో చెప్పమంటే చెప్పలేను. అవధాన ప్రక్రియకు సరిగ్గా వ్యతిరేకమన్న మాట. వాళ్ళకి విన్న వన్నీ 'పెర్మనెంట్ మెమొరీ'లో స్టోర్ అయి ఎప్పుడు కావాలంటే అప్పుడు రిట్రీవ్ అవుతవి. నాకు పర్మనెంట్ మెమొరీలో ఏదీ స్టోర్ కాదు. టెలిఫోన్ నెంబర్లు కొనవలసిన సరుకుల లిస్టు గుర్తుండవు.

ఈ పుస్తకంలో నేనేం వ్రాసానో స్థూలంగా గుర్తుంటుంది కానీ 'డీటెయిల్స్' గుర్తుండవు. నన్ను బాధించే అంశం ఇదే. నా రచన నాది అని కూడ నిరూపించుకోలేను. ఆ పరాత్పరుడు నాకు ఎందుకీ శిక్ష వేశాడో ఆయనకే తెలియాలి.

అయినా విసుగు చెందని విక్రమార్కుడు భేతాళుణ్ణి మోసినట్లు ఈ అవకరంతోనే నెట్టుకొస్తున్నాను. ఈ 'సోది' ఎందుకు చెబుతున్నానంటే ఇందులోని చాలతప్పులు 'ఓవర్‌సైట్‌వల్ల' వచ్చినవే.



ఈ మాత్రమన్నా చేయగలిగానంటే కారణం వేరెవ్వరూ కాదు. ఆ త్రివిక్రముడే....

**ఆ॥ వెన్న దొంగిలించి వెలదుల నేడ్పించి**
**చంపనున్న అరుల జంపినాడు**
**ఏది ఎవరికీయునెవ్వడెరుంగును**
**చేసుకొన్న వాన్కి చేసినంత**

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి, నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

❋❋❋

## ప్రార్థన

ఉ॥ శ్రీరమణీ మనోవిభుడు శ్రీహరి వామనమూర్తి
రూపియై
చేరెను దైత్యవల్లభుని చేతులు జాచెను భిక్ష
కోరుచున్
కూరిమి దానమిచ్చెదను కోరుమనెన్ బలి ధీర
చిత్తుడై
మీరిన కీర్తిగాంచె బలి మేదిని దాతల నగ్ర
గణ్యుడై

కం॥ ఒక పాదముతో పుడమిని
ఒక పాదముతోటి దివిని ఉన్నతముగ తా
నొక పాదము బలి తలనిడి
సకలము హరియించు హరికి సరికనగలమే!



సీ॥ చూపులకందని సురవందితుడవీవు
చూచు మార్గంబేమి సుజన వినుత!
మాటలకందని మహిమాన్వితుడ వీవు
విను మార్గమది యేది విమల చరిత!
పూజలకందని ఉర్వీధవుడ వీవు
పొందు మార్గంబేది ఇందువదన!
దరిజేరి కరుణతో తాకినా తెలియదే
తెలియు మార్గంబేది జలజనాభ!

ఆ॥ ఒరుల నమ్మనాయె ఒళ్ళంత పొగరాయె
అహమువీడనాయె హరియనంచు
మనుసపెట్టి నిన్ను అననాయె శరణని
అగ్నిదూకు శలభమైతి నాయె.



ఆ॥ హరిని గొలిచి ఒకడు అయ్యనే జంపించె
హరికి మ్రొక్కి ఒకడు తార ఆయె
హరికి దానమిచ్చి అతని గాంచెనొకండు
హరిని నమ్మువాడు అంతమవడు.

ఉ॥ వాసనలేని పూవు తన వారికి బెట్టని సంపదం
తయున్
గ్రాసములేని సేవయును కమ్మగ పాడని గాత్ర
మీ భువిన్
నీమములేని పూజయును నిగ్రహమొందని
భోగ భాగ్యముల్
ఏమిటికిన్ పరాత్పరుని ఈశ్వరు గొల్వని జన్మ
మేటికిన్.



మ॥ తెలియన్ జాలను నీదు లీల వరదా! దీనుండ
మన్నింపుమా
తొలి జన్మంబుల పుణ్యమేమికలదో దుఃఖం
బులన్ వీడితిన్
విలువౌ భాగ్యము విష్ణు నామమొకటే వేనోళ్ళ
కీర్తించితిన్
కలిగెన్ శ్రీహరి పెంపు నిక్కమిది నా గర్వంబు
ఖర్వంబయెన్

కం॥ విలువగు పలుకులు తెలిపెద
విలువలు ఇల తొలగి పలుకు వెలవెల బోయెన్
విలువలు తెలియని దొరలకు
విలువలు భళి! కలిగె కలిమి విలసిల్లుటచే.

## అంకితము

**చం॥ ఒనరగ 'రామ' నామమును ఓపికతో**
**జపియించి నెమ్మదిన్**
**మును తముజేయు కర్మలకు ముక్తిని బొందక**
**ఈ ధరావనిన్**
**అనుదినమా పరాత్పరుని ఆర్తితొ కొల్తురు**
**నమ్మకంబుతో**
**పనివడి అంకితమ్ము నిడి, ప్రాప్తిలజేతును**
**కొంత ఊరటన్**

తా॥ ఆ స్వామిదయ అందరికీ దొరకదు. పురాకృత కర్మ ప్రభావంచేత భగవంతునిపై భక్తి కుదురుతుంది. కాని ఆయన దయ కలుగదు. వారు జీవనయాత్ర సాగిస్తూ సుఖదుఃఖాలు పొందుతు ఆ స్వామిపై ప్రేమ, నమ్మకం వదలకుండా "ఓ ప్రభూ! నీవే దిక్కు



అంటుంటారు. ఆ విధంగా ఈ ప్రపంచంలో ఆ సర్వేశ్వరుని ఏదో ఒక రూపంలో ఏదో ఒక పేరుతో, ఎక్కడో ఒకచోట నిత్యము కొలుస్తూనే వున్నారు. వారందరికీ దీనిని అంకితం చేసి కొంత పుణ్యం అందించి ఊరట కలిగింతును గాక!



## త్రివిక్రమ విజయమ్

దేవేంద్రునిచే పరాజితుడై 'బలి' యెట్లో ప్రాణములు దక్కించుకొని దెబ్బలు తిని తన నివాసమును చేరెను. అసురుల గురువైన శుక్రాచార్యుల వారు బలిపై జాలిగొని తన మంత్రబలిమిచే వానికి ఉపశమనమును కలిగించెను. తననే నమ్మి 'త్వమేవ శరణం' అన్న శిష్యుని ఓదార్చి అతనిచే విశ్వజిత్ అను యాగమును చేయించెను. దానికి అగ్నిహోత్రుడు పరమ సంతుష్టుడై సూర్యుని రథాశ్వములవంటి అశ్వములను, సింహధ్వజము అను ధనస్సును, బాణములతో నిండిన రెండు అమ్ముల పొదులను కవచమును ఇచ్చెను.

బలి తాతగారైన ప్రహ్లాదుడు ఎప్పుడూ వాడిపోని పద్మమాలిక నిచ్చెను. గురువైన శుక్రాచార్యుడు చంద్రుని వలె తెల్లనైన శంఖమునిచ్చెను. వాటిని ధరించి బాగుగా అలంకరించుకొని ఇంద్రుని జయింప గోరి అమరావతిపై



దండెత్తుటకు నిశ్చయించెను. బ్రాహ్మణులకు విరివిగా దానములు చేసెను. త్రిమూర్తులను పూజించెను. తన తాత ప్రహ్లాదుని పూజించెను.

అటు పిమ్మట అరి వీరభయంకరులైన రాక్షస సేనతో బయలుదేరి అమరావతీ నగరమును ముట్టడించెను. దానవ వీరుల కోలాహలమునకు దేవతా స్త్రీలు గజగజ వణికిరి. గర్భవతులైన దేవకాంతలకు గర్భస్రావము లాయెను. దనుజుల శంఖారావములకు నెలలు నిండిన స్త్రీలకు లోపలి శిశువులు బయటకు వచ్చి యావురుమని ఏడ్వజొచ్చిరి.

తన అమరావతిపై బలి దండెత్తుట నెరింగి దేవేంద్రుడు గట్టిగా కాపునేర్పాటుచేసి తమ గురువు బృహస్పతిని రావించి **బలి ప్రళయకాల రుద్రునివలె మనపై దండెత్తుటకు కారణమేమి, మనచే ఓడి పారిపోయిన అతనికి తిరిగి ఇట్లు మనపై వచ్చు బలమెక్కడిది, యిపుడు వీని నెదిరించుట తగిన పనియేనా? మేరు పర్వతముకంటే**

**మించి పెరిగినట్లున్న వీనినాపుటెట్లు? బ్రహ్మనే గెలువ గలిగినట్లున్న వీనిని నిరోధించుటెట్లు? యుద్ధమున మరణము తప్పదా అని అడిగెను.**

**దానికి బ్రహస్పతి "అమరేంద్రా! శుక్రాచార్యుని అనుగ్రహమున బలోపేతుడైన ఈ బలినెదిరించుటకు ఆ శివకేశవులకు దక్క అన్యులకసాధ్యము. నీవు గాని నీ సన్నిహితులుగాని, నీకంటే అధికులు గానీ ఇతనిని ప్రస్తుతమేమియూ సేయలేరు. ఇక నీ ఏలికకు కాలము చెల్లినది. ప్రస్తుతము పారిపోయి తలదాచుకొనుటయే తరుణోపాయము. తిరిగి మంచికాలము వచ్చినపుడు శత్రువు నెదురింతము. ప్రస్తుతమెదిరించి పోరలేవు. పోరి వీరమరణము జెందు భాగ్యము కూడ నీకు లేదు. అమృతము సేవించితివి గదా! ఊరకే చావు దెబ్బలు తిని బాధ పడుట దేనికి? కనుక నీవే స్వర్గము వదలి పారిపోయి జీవించుము** అని బోధించెను.

బృహస్పతి సలహా ననుసరించి దేవతలు దిక్కులబట్టి



పారిపోయిరి. రాక్షసులు దేవ రాజధానియైన అమరావతి నాక్రమించి తమ అధీనములోనికి తెచ్చుకొనిరి.

బలి క్రమక్రమముగా ముల్లోకముల నాక్రమించి, తన ఏలుబడిలోనికి తెచ్చుకొనెను. బలి విశ్వవిజేతయై పెక్కు సంవత్సరములు సుస్థిర రాజ్యపాలనము చేసెను. శిష్యునిపై అనురాగముచే శుక్రాచార్యుడు, పూని, బలిచక్రవర్తి చేత నూరు అశ్వమేధ యాగములను నిర్విఘ్నముగా చేయించెను. ఇక నా బలిచక్రవర్తి పరిపాలన ఎలా ఉందంటే...

**సీ॥ చెయి జాచదెవ్వండు చేరి అన్యుల చెంత**
**లేమియనునదేది లేకపోయె**
**దానమిచ్చుట లేక ధనవ్యయంబది లేదు**
**ధనరాశి యించుక తరుగదాయె**
**సస్యంబులన్నియు జక్కగా పండుటన్**
**ఆకలి అనువాని నరయరాయె**



**దేవాలయములందు దివ్యవైభవముతో**
**జరిగెనుత్సవములు సంబరములు**

**తే॥ నెలకు మూడేసి వానలు నియతి గురిసె**
**విప్రులందరు తృప్తి దీవించినారు**
**బలిని, ఆతని కొకడైన వైరి లేదు**
**ఇల వసుంధర యను కీర్తి యినుమడించె**

(పోతనగారి "అర్థుల్ వేడరు దాతలున్ జెడరు...." ఆధారంగా)

తా॥ ఆ బలి చక్రవర్తి పరిపాలనలో దరిద్రమనునదే లేక చెయ్యి జాచి అడుక్కునే వాడే కనబడలేదు. దానం ఇవ్వటం అవసరంలేక, ధనము వ్యయం కాక, ధనరాశి పెరిగి పోసాగింది. అన్నిపంటలూ చక్కగా పండుటజేత, ఆకలి అనే వాడే కనబడలేదు. అన్ని దేవాలయాలలోను మహా వైభవంతో ఉత్సవాలు



సంబరాలు జరుగుచుండెను. ఒక్క నియమం ప్రకారం నెలకు మూడు వానలు కురిశాయి. బ్రాహ్మణులందరూ తృప్తిగా బలిచక్రవర్తిని దీవించారు. అతనికి శత్రువన్నవాడే లేకుండెను. భూమికి 'వసుంధర' అన్న కీర్తి వృద్ధి చెందినది.

తనపుత్రులగు దేవతల సిరిసంపదలను లాగికొని వారిని అమరావతినుండి తరిమివేసి, రాక్షసులు పరిపాలించగా, తన పుత్రులు దిక్కులేని వారై మారు వేషములలో తిరుగుచుండుటను, దేవమాత అదితి భరించలేకపోయినది. ఆమె భర్త కశ్యప ప్రజాపతి తపస్సమాధిని విరమించి తనగృహమునకేతెంచి విచారగ్రస్థయైన ఆమెను జూచి యట్లుండుటకు కారణం బడిగెను. **"ఓ ప్రియురాలా! నీ విచారమునకు కారణమేమి? విప్రులందరూ పరిపూర్ణులై యున్నారు కదా? దేవాలయములలో అర్చనలు సవ్యముగా జరుగుచున్నవా? గృహస్థులు ఆయా కాలములందు అగ్నిహోత్రములను హోమములను చేయుచున్నారా? నీ పుత్రులు ధర్మము**

ననుసరించుచున్నారా? అతిథులకు అభ్యాగతులకు అన్న పానములు నిరవధికముగా లభించుచున్నవా? నీవు అర్థులను, భక్తులను, మునులను గౌరవించుచున్నావు గదా? అతిథి పూజయే ముఖ్యము సుమా! మనకున్నదానిలో అతిథులకు అన్నమైనను, అదిలేక మజ్జిగయైనను, అదియునూ లేక జలమునైనను ఈయవలెను. ఇట్లు చేయని ఉన్నవారునూ లేని వారితో సమానమే.

అందరి దేవతలకు ఆత్మ శ్రీహరియే. ఆయనకు అగ్నియు, బ్రాహ్మణులును ముఖ్యము. ఇక వారు తృప్తి పొందినచో శ్రీహరియు తృప్తి జెందును. శ్రీహరి తృప్తి చెందినచో జగములన్నియు తృప్తి చెందును. నీ పుత్రులు నీకు భయపడుచూ నీ చెప్పు చేతలలో నున్నారు గదా! నీకే కష్టమూ లేదు కదా?"

అప్పుడు అదితి భర్తతో విచారముగా నిట్లన్నది. "ఓ మహానుభావా! నేనేమి చెప్పను? దితి పుత్రులకును మన పుత్రులకును మధ్య కొంచెమైనను సఖ్యత, ప్రేమ



లేకున్నవి. నా బిడ్డలను దైత్యులు తరిమి తరిమి కొట్టి హింసించు చున్నారు. వారు అమరావతి నాక్రమించి, నా బిడ్డలను అనాథలను చేసి, వారే పాలించుచున్నారు. మేము అక్క చెల్లెళ్ళ మైనను దితి యెల్లప్పుడు నాతో తగవులాడుచునే యున్నది. నా బిడ్డలను హింసించుచున్న తన బిడ్డలను వారించక, ప్రోత్సహించుచున్నది.

సీ॥ కల్పతరువు ఛాయ గడుపు శచీదేవి
పరుల నీడను నిల్చి బ్రతుకవలసె
భువనత్రయంబేలు దేవనాథుడు నేడు
వనముల తిరుగాడి వగచుచుండె
సురభోగములదేలి సొక్కు జయంతుండు
భిల్ల బాలురనాట వెంబడించె
అమరుల నగరంబు అమరావతీ పురి
సురవైరులుండెడి చోటదాయె



ఆ॥ బలిమి పెరిగి నేడు బలి 'బలిసెను' వాని
నిలిచిపోరి గెలువ వీలు లేదు
జాలి దలచి 'ముష్టి' గలిపించ డీనాడు
యాగఫలమునందు అసురవిభుడు

(పోతనగారి "ఎండకన్నెరుగని...." ఆధారంగా)

తా॥ ఇంద్రుని భార్యయైన శచీదేవి, కల్పతరువు నీడలో విశ్రాంతి తీసుకొంటుండేది. అటువంటి ఇల్లాలు మారు రూపంలో పరుల ఇండ్లలో బ్రతుకవలసి వచ్చింది. మూడు లోకాలను పరిపాలించే దేవేంద్రుడు నేడు అడవుల్లో తిరుగుతూ అలమటిస్తున్నాడు. అలిసిపోయేదాక దేవతల భోగాలన్నీ అనుభవించే జయంతుడు తను ఇంద్రుడి కొడుకుననే సంగతి మరిచిపోయి కోయపిల్ల గాండ్రతో ఆడుకుంటూ పరుగులు తీస్తున్నాడు.



దేవతల ముఖ్య నగరం అమరావతి నేడు రాక్షసుల స్థావరం అయిపోయింది. ఆ బలిచక్రవర్తికి బలం పెరిగి బలిసిపోయి ఉన్నాడు. వానినెదురించి యుద్ధం చేయుట అసాధ్యం. వాడు దయతలచి యాగఫలములలో ఒక్క ముద్ద కూడ నా బిడ్డలకు పెట్టుటలేదు.

**నీవు ప్రజాపతివి. నీకు బిడ్డలందరునూ సమానమే కదా! వారిలో మంచి వారికి మేలు చేయుట దుర్మార్గులను శిక్షించుట, నీ కర్తవ్యము కదా! దేవతల నగరమైన అమరావతి నాక్రమించి నా బిడ్డలనాథలను చేసి నలుదిక్కుల పారిపోవునట్లు చేసి, ఆహారమును కూడ తిరస్కరించుచున్న ఆ దైత్యులను నిలువరించి నా బిడ్డలను రక్షింపుము. వారిని కనికరింపుము** అన్నది.

దానికి కశ్యప ప్రజాపతి కొంత తడవు విచారించి చివరికిలా అన్నాడు. ప్రియా!

**ఉ॥ ఎవ్వడు తండ్రి? జన్మమది యెట్టిది? పుట్టుక**
**లేమి? మేనులున్**
**ఎవ్వరివైన గూలెడివె, ఏయది నిత్యము? ఈ**
**జగంబునన్**
**ఎవ్వడు నేర్వలేని జగదీశుని మాయను దెల్వ**
**సాధ్యమే!**
**నువ్విక వీడి మోహమును నొచ్చుట మానుము**
**చింత వీడుమా.**

(పోతనగారి "జనకుండెవ్వడు...." ఆధారంగా)

తా॥ తండ్రెవరు? జన్మమేది? పుట్టుక లెటువంటివి? శరీరం ఎవ్వరిదైన నశించిపోయేదే కదా! ఏది నిత్యం? ఈ ప్రపంచంలో ఎవ్వరూ తెలుసుకోలేని జగత్పతి విష్ణుమూర్తి మాయను తెలుసుకోవటం సాధ్యమా? ఇక ఈ వ్యామోహం విడిచిపెట్టి విచారం వదిలి బాధపడకు.



**అయిననూ కాలోచితమైన కార్యమును చెప్పెదను గ్రహింపుము. నీవు సర్వాత్మకుడును, భగవంతుడును అయిన శ్రీహరిని సేవింపుము. అతను నీ అభీష్టము ననుగ్రహించును. నిఖిలార్ధములను సిద్ధింపచేయును. కేవలము భగవత్సేవ వలననే సమస్త సౌభాగ్యములు సిద్ధించును.**

అది విని ఆమె భర్తకు శ్రీహరిని ధ్యానించు విధానమేమో? దానికి విహితమౌ ఆచారములేవియో? ఎంత కాలము ఆరాధించవలెనో వివరముగా తెలుపమని ప్రార్థించెను.

అప్పుడా అదితికి కశ్యపుడిట్లు చెప్పెను.

**"పయో భక్షణము" అను వ్రతము కలదు. దానిని ఫాల్గుణ శుద్ధ పాద్యమి నుండి పండ్రెండు దినములు హరి సమర్పణముగా ఆచరించవలెను. నియమము తప్పక**



**ఏకాగ్రత వదలక హరినే మదిని నిలిపిన యెడల చతుర్భుజుడును, శంఖ చక్రగదాయుతుడైన, పీతాంబరుడు శ్రీహరి ప్రత్యక్షమై నీకోరిక తీరుస్తాడు"** అని ఆ వ్రతవిధానమును సవిస్తరంగా వివరించాడు. ఆమె భర్త చెప్పినట్లే శ్రీమన్నారాయణుని దివ్య సాక్షాత్కారం పొందింది.

ఆమె శ్రీహరిని కీర్తిస్తూ **"ఓ యజ్ఞేశా! విశ్వంభరా! అచ్యుతా! శ్రవణానందకరనామధేయా! లోకస్వరూపా! సృష్టి స్థితిలయకరా! సంతతానందా! నిన్ను సేవింపని వారికి ఆయుస్సు, సంపద, భూవసతి, చతుర్విధ పురుషార్ధములు, వైదిక జ్ఞానయుక్తి, శత్రుజయము ఎట్లు లభించును? దేవా! రాక్షసులు నాబిడ్డలైన దేవతలను స్వర్గమునుండి తరిమివేసి భుక్తి లేకుండా చేశారు. నాకంటికి నిదుర లేదు. కన్న కడుపుగదా! నీవు నా కడుపు బాధ నివారింపుము"** అన్నది. అంత శ్రీహరి.



**సీ॥ నీ భర్తకున్ నీకు నీకొమరులకు నీ**
**కోడండ్రకున్ మేలు గూర్తునమ్మ!**
**సురుల చింతల ద్రోల సురుచిరంబగు లీల**
**నీకుద్భవింతును నీ సుతునిగ**
**బలిని నిర్జించుట బలిమినసాధ్యంబు**
**యుక్తిచే గెలుచుట యుత్తమంబు**
**మెచ్చితి నీభక్తి వీడుము దుఃఖంబు**
**హరియింతు బలినుండి అతని సిరులు**

**తే॥ ఇంద్రుడును వాని సుతులును ఇంతియున్న**
**మెచ్చునట్లుగ వారికి మేలు జేతు**
**తిరిగి విభవము నొందును సురవిభుండు**
**బలికి తొలగును పీఠంబు బలిమిపోవు**

(పోతనగారి "నీకోడండ్రును.... మరియు
బలిమిన్ దైత్యుల జంపరాదు".... ఆధారంగా)

తా॥ ఓ అదితీ దేవి! నీకు, నీ భర్తకు, నీ కొడుకులకు, నీ కోడళ్ళకు నేను మేలు కలిగించెదను. దేవతల మనోవ్యథ తొలగించుటకు దివ్య లీలతో నీకు పుత్రునిగా జన్మింతును. ఆ బలిచక్రవర్తిని బలము ప్రదర్శించి గెలుచుట అసాధ్యము. వానిని యుపాయము చేత మాత్రమే అణచగలము. నేను నీ భక్తికి సంతృప్తి చెందాను. ఆ బలినుండి అతని భాగ్యములనన్నింటినీ హరింతును. ఇంద్రుడు వాని ఆలుబిడ్డలు మెచ్చుకొను విధమున వారికి మేలు చేస్తాను. సురేంద్రుడు తిరిగి తన పూర్వపు వైభవము పొందగలడు. బలికి స్థాన భ్రంశం కలిగి తన బలం పోగొట్టుకుంటాడు.

**“నన్ను ధ్యానించుచూ నీ భర్తను సేవింపుము. నేను నీ గర్భమున ప్రవేశింతును. నన్ను కరుణతో గారాబముగా పెంచుము. నేను దానవులను నిర్మూలింతును. నీకుమారులు తిరిగి స్వర్గసుఖములనుభవింతురు”** అని



చెప్పి భక్తవరదుడైన శ్రీమన్నారాయణుడు ఆనతిచ్చెను. అంత శ్రీహరి అంతర్ధానమయ్యెను.

అదితి సంతోషముతో భర్తను సేవింపసాగెను. ఆమె అనతి కాలములోనే గర్భమును ధరించెను. శ్రీహరి అదితి గర్భమున ప్రవేశించెను. బ్రహ్మదేవుడు గర్భమునందున్న ఆ శిశువుతో ఇట్లనెను. **“ఓ దేవా! త్రిభువనములను జయించినవాడా! త్రివిక్రమా! జగములన్నింటికిని ఆది మధ్యాంతములు నీవే. స్థావర జంగమాత్మకమైన సృష్టికి నీవే కారణభూతుడవు. నీవే కాలరూపుడవు. సమస్తమూ నీయందే దర్శింతువు. బ్రహ్మాలందరిని నీవే సంభవము జేయువాడవు నీవే. దుఃఖసాగరములో మునిగియున్న అనాధలైన దేవతలకు నీవే దిక్కువు. వారిని ఉద్ధరించే తెప్పవు నీవే. శీఘ్రముగా అదితి గర్భమునుండి వెలువడి దేవతల ఆర్తిని తొలగించుము”.**

అటుపిమ్మట అదితికి గర్భవతి పొందు దశలను పొందెను.



**తే॥ నెలత చూలింత, వరుసగా నెలలు నిండె**
**నెలలు మూడాయె, నాల్గైదు నెలలదాయె**
**నెలలు క్రమముగా పూర్తిగా నిండిపోయె**
**నెలలు దగ్గరపడె బలి నిలుపదలకు.**

(పోతనగారి “నెలతకు జూలై....” ఆధారంగా)

తా॥ స్త్రీ మూర్తియైన ఆ అదితీ దేవి గర్భవతి యైనందున వరుసగా నెలలు నిండసాగినవి. మూడు నెలల తరువాత నాలుగు ఐదు నెలలదయిందామె. వరుసగా నెలలు పూర్తి అవుతుండగా అక్కడ రాక్షస సామ్రాట్టయిన బలియొక్క నిలుపుదలకు కూడ నెలలు దగ్గిరపడసాగినవి.

పుణ్యవతి, పరమపతివ్రతయు నైన అదితి శ్రావణ ద్వాదశి నాడు, శ్రవణా నక్షత్రయుక్త అభిజిత్



ముహూర్తమున సర్వలోకాధిపతియైన శ్రీమన్నారాయణుడు వామన రూపమున జన్మించెను.

ఆ దేవదేవుడు శంఖ, చక్ర, గదా, పద్మములు గల చతుర్భుజుడై, పీతాంబరుడై, కౌస్తుబాది మణిరత్నయుక్త దివ్యాభరణ భూషితుడై, శ్రీవత్సమను పుట్టుమచ్చచే శోభిల్లువాడై, పద్మనేత్రుడై, కిరీటము కేయూరములచే వెలుగులు జిమ్ము శరీరకాంతికలవాడై, నిఖిల జనమనోహరణుడై, అవతరించెను.

ఆ స్వామి ఉద్భవించగానే యక్ష, గరుడ, నాగ, సిద్ధ, సాధ్య, చారణాది దేవగణములు స్తోత్రించిరి. శివుడు, బ్రహ్మ, విద్యాధరులు మిక్కిలి సంతసించిరి. సూర్యచంద్రుల కాంతి మిక్కుటమయ్యెను. ఆకాశమున గంధర్వ కిన్నెర కింపురుషులు వివిధ వాయిద్యములు ప్రయోగించుచు గీతములాలపించిరి.

అప్పటిదాకా దిక్కులందు పొడచూపిన ఉత్పాతము సూచించిన కావిరంగు నశించినది. సప్త సముద్రములు

కల్లోలములేక ప్రశాంతమైనవి. పూలవాన కురిసెను. ఆ పూవుల పుప్పొడి వలన భూమిపై మిక్కిలి బురద ఏర్పడెను.

అదితి పరమాశ్చర్యము జెందెను. కశ్యపుడు మిక్కిలి సంతోషించెను. పిమ్మట పరమభక్తి పారవశ్యమున కీర్తించెను. అంతలో దేవదేవుడు తన దివ్యరూపము నుపసంహరించి వేరొక రూపమును ధరించెను. ఈ సారి అతడు వడుగు చేయదగ్గ బాలకుని రూపమున గోచరించెను. ముద్దులొలుకు ఆ కపట వటువును గాంచి అదితీ దేవి ఆశ్చర్యానందాబ్ధి నోలలాడుచూ ఇట్లనెను.

**కం॥ నాపాలి దైవమా! మము**
**కాపాడుట కవతరించు కరుణా సింధూ!**
**దీపంబై మాకులమును**
**వ్యాపింపగ జేయు నాదువటువా! తండ్రీ!**

(పోతనగారి "నన్నుగన్న తండ్రి....." ఆధారంగా)



తా॥ వటువు రూపంలో ఉన్న నా తండ్రీ! కరుణా సముద్రుడా! నావైపునున్న దైవమా! మమ్మల్ని రక్షించుటకు అవతరించిన స్వామీ! మా వంశమునకు దీపమై వ్యాపింప జేయుటకు వచ్చినవాడా! (నమస్కారము)

అటు పిమ్మట ఆమె ఆతని మోమును ముద్దాడుచు కౌగలించెను. "ఈ అదితికి లక్ష్మీదేవియే పురుడు (సాటి). ఆ పార్వతీదేవియే పురుడు. ఇతర యువతులెంత మాత్రము ఈమెకు పురుడు కారు" అని తలంచుచు పుణ్యవతులామెకు పది దినములు 'పురుడు' (కానుపు) పోసిరి.

ఆపైన కశ్యపుడు సంతోషముతో వామనునికి ఉపనయనము చేసెను. ఆ సమయమున సూర్యుడు అతనికి సావిత్రిని (గాయత్రీ మంత్రమును) ఉపదేశించెను. బృహస్పతి యజ్ఞోపవీతమునిచ్చెను. కశ్యపుడు ముంజిమొలత్రాటి నిచ్చెను. అదితి కౌపీనము (గోచి)



నిచ్చెను. భూదేవి కృష్ణాజినమిచ్చెను. వనస్పతియగు చంద్రుడు దండమునిచ్చెను. గగనాధిష్ఠాన దేవత ఛత్రము నొసంగెను. బ్రహ్మ కమండలము నొసంగెను. సరస్వతీ దేవి జపమాలనొసంగెను. సప్త ఋషులు కలిసి కుశపవిత్రముల నొసంగిరి. కుబేరుడు అక్షయమైన భిక్షా పాత్రనిచ్చెను. అన్నపూర్ణ వామనునికి భిక్షపెట్టెను. శుద్ధ బ్రహ్మ వర్చస్సు గల ఆ వటువు అనాదిగా వస్తున్న ఆచారము ననుసరించి విహిత మంత్రములను చదువుతూ హోమము చేయసాగెను.

అట్లు కృతకృత్యుడైన ఆ మాయావటువు దేశాంతరమునుండి వచ్చిన కొంతమంది బ్రాహ్మణులను కలిసి **మీరు దేశాంతరము నుండి వచ్చి యున్నారా! అట్లయిన విప్రులు యాచించదగిన గొప్పదాత ఈ దేశమున ఎవ్వడు? ఎవనినన్నా యాచించిన మీకు సంపద లభించినదా?** అని ప్రశ్నించెను.

దానికి వారు **"దాతలకు లోటేమి? సమృద్ధిగా నున్నారు. కోరినవన్నీ యొసంగుచునే యున్నారు.**



**బ్రాహ్మణులు సంతృప్తి చెంది ఆనందముగా పోవుచునే యున్నారు. అయినను త్యాగులందరిలో సర్వశ్రేష్ఠుడు ప్రహ్లాదుని మనుమడైన బలిచక్రవర్తి. అతనిని బోలిన వయస్యుడు మరియొకడు లేడు. అతని గురువైన శుక్రాచార్యుని యానతి జొప్పున నూరు యాగముల నొనరించి యున్నాడు. అతనిని యాచించినచో కోరినవన్నీ సమృద్ధిగా లభించును"** అని తెలియజెప్పిరి.

వామనుడు తల్లిదండ్రుల దీవెనలను గైకొని ఒక శుభముహూర్తమున బయలుదేరెను.

**ఆ॥ దిక్కులేనివాడు దేవేంద్రుడైయుండ**
**వాని గావ సిరికి వల్లభుండు**
**తిరిపె మెత్తనేగె సురవైరి చెంతకు**
**పేదవానివోలె వింత కాదె!**

(పోతనగారి "ప్రక్షీణదివిజవల్లభ...." ఆధారం)

తా॥ దేవేంద్రుడంతటివాడు దిక్కులేని వాడై కష్టాలు పడుతున్నాడని, అతనిని రక్షించు తలంపుతో లక్ష్మీపతి అయిన శ్రీమహావిష్ణువు చివరికి రాక్షస చక్రవర్తి దగ్గిర ముష్టి ఎత్తుదామని సిద్ధమై యాచకునివలె చేరాడు ఎంతో వింతకదా!

శ్రీదేవినే తన హృదయంలో నిలుపుకొన్న ఆ మహానుభావుడు నేడు ఆ ఇంద్రుడికోసం ఒక రాక్షసుణ్ణి యాచించుటకై బయలుదేరాడు. పరుల మేలుకోసం ఇతరులను యాచించుట బయలుదేరాడు. పరులమేలుకోసం ఇతరులను యాచించుట మహాత్ములకు భూషణమే కదా!

ప్రపంచముల నన్నింటినీ తన ఉదరంలో నిర్వహించే ఆ వామనమూర్తి బరువును భరించలేక భూమి ఒక ప్రక్కకు క్రుంగింది. భూమిని మోసే సర్పరాజు ఒక ప్రక్కకు మ్రొగ్గెను.



అట్లు బయలుదేరిన వామనమూర్తి మార్గమున నర్మదా నదిని దాటి దాని ఉత్తరదిశగా ప్రయాణించి దాని ఉత్తర తీరమున నున్న బలియాగశాలను గాంచెను. అచ్చట రాక్షస వీరులు బహు విధంబులైన ప్రలాపము లాడుచు ముచ్చటించు చుండిరి. మునీశ్వరులు హోమములు చేయుచుండిరి. దేవతలు సిద్ధులు భయం భయంగా జూపట్టిరి. గజసైన్యం విజృంభించి యుండెను. హోమం యొక్క పొగ సూర్యుణ్ణే కప్పివేసేంత దట్టంగా వస్తున్నది.

దానిని దాటి అశ్వమేధ యాగశాలను ప్రవేశించెను. అచ్చటనున్నవారు అతనిని జూచి....

**ఉ॥ శంకరుడో, రమాధవుడొ, చంద్రుడొ, బ్రహ్మయొ,**
**అగ్నిదేవుడో**
**జంకక మారురూపమున చల్లగ జేరిన యాత**
**దెవ్వడో**



**వంకలు పెట్టలేమితడు బ్రాహ్మణ బాలుడు కాక**
**పోవునో**
**శంకలు దీరుటెట్లనుచు సభ్యులు పల్కిరి**
**మెల్ల మెల్లగా**

పోతనగారి "శంభుండో హరియో....." ఆధారంగా

తా॥ ఆ సభలోనున్న వారందరూ అంతులేని ఆశ్చర్యంతో "ఈ పిల్లవాడు ఏ మాత్రము భయం లేకుండా తిన్నగా సభలోకి వస్తున్నాడు గదా! ఈతడెవడై యుంటాడు మారు రూపంలో నున్న శంకరుడా, లక్ష్మీపతియైన శ్రీహరియా, చంద్రుడా, బ్రహ్మ దేవుడా, అగ్నిహోత్రుడా, ఎవరైయుంటాడు? ఏ మాత్రం ఆక్షేపణ చేయలేని బ్రాహ్మణ బాలుడు కాకుండుటయూ అసాధ్యమే. ఇక ఈ సందేహం ఎవరు తీరుస్తారో తెలియుటలేదే" అని గుసగుస లాడుకొన్నారు.



పుట్టుక నెరుగని యీ పొట్టి వటువు సభలో కాలుపెట్టగానే ఉద్గాతలు చేయు సామగానం చెవుల కింపుగా వినబడింది. మంత్ర తంత్రార్థములు వివరించు హోతల దర్శనమైనది. హోమగుండములలో త్రేతాగ్నులు వెలిగించు యాజకులు కానవచ్చిరి. బహు విధములైన యాగ విధానములను నేర్పుతో ప్రసంగించు సభ్యులు కనబడిరి. ఇంద్రుని రాజ్యసంపద తిరిగి అతని కిప్పించుటకు ఏతెంచిన ఆ వామనుడు చూచుటకు మనోహరంగా వున్నాడు.

**ఆ॥ బుడత నడక జూడ వడివడి అడుగులు,**
**వడుగువటుని రూపు బడుగు తొడవు,**
**తడబడెనుగ అతడి చిడుముడి యడుగంగ**
**బుడి బుడి నడకలకు పుడమి డిగియె.**

(పోతనగారి "వెడవెడనడకలు...." ఆధారంగా)

తా॥ ఆ పిల్లవాడి నడక చూడబోతే బుడి బుడి నడక. ఆ పిల్లవాడి రూపం చూడబోతే వడక పెళ్ళికొడుకు. చిడుముడి అడుగుటకు ఆ వామనుడు తడబడెను. అతను వేసిన బుడి బుడి నడకకే ఈ భూదేవి క్రుంగిపోయింది.

ఆ మాయా భిక్షకుడు దనుజేశ్వరుని జూచి **"ఆ రాక్షసరాజు ఇతడే కాబోలు. ఇంద్రాదిదేవతల గర్వమును** ఖర్వంబుజేసిన వాడును, లోభిత్వము నెరుంగనివాడను, నానావిధములైన దానధర్మముల నాచరించువాడును, దేవ వనితల మనస్సులను ఛిద్రము జేసినవాడును, చంద్రుని బోలిన స్వచ్ఛమైన వెన్నెలవంటి కీర్తిగలవాడును, సత్యము ధర్మము కరుణకు నిలయమైన వాడును, అగు బలిచక్రవర్తి ఇతడే' అని నిశ్చయించుకొనెను.

ఆ వటువు దర్భలు అక్షతలుగల తన దక్షిణ హస్తము (కుడిచెయ్యి) ఎత్తి దీవించుచూ ఇట్లనెను. **"ముల్లోకములను**



**శాసించు వాడును, చిరునవ్వు ప్రదర్శించి సురేంద్రుని పదభ్రష్టుని చేసినవాడును, ఉదారపదమున నున్నవాడును, మునీంద్రులు కొనియాడు యాగములను నిర్వహించిన వాడును, దేవవనితలకు మంగళ సూత్రములను నష్టపరచినవాడును, దానవ సార్వభౌముడును అయిన బలిచక్రవర్తికి స్వస్తి"**

అట్లు దీవించగా, రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు కరచరణాది అవయవములను ధరించిన వేదరాశివలె ప్రకాశించు వాడును, అకుటిలుడును, జటాధారియును, దండచ్ఛత్రములు కలవాడును, కక్షము నుండి వ్రేలాడు భిక్షాపాత్రముగలవాడును, జలముతో నిండిన కమండలమును చేత ధరించినవాడును, మనోహర చంద్రబింబం వంటి ముఖము కలవాడును, మాయావాదన సమర్థుడును, అగు వామనుని చూచి సూర్యకాంతి ముందు వెలవెలబోవు గ్రహమండలము వలె కాంతి విహీనుడై, కూర్చున్నవాడు లేచి వామనుని క్షేమమడిగి పైకి తియ్యగా మాట్లాడెను.



బలిచక్రవర్తి వామనునికి నమస్కరించి తన సింహాసనముపైనుంచి దిగి అతనిని అందు కూర్చుండజేసి పాదములను తుడిచి, తన అర్ధాంగి బంగరు పాత్రతో నీరు పోయుచుండగా వామనుని కాళ్ళు కడిగి నీళ్ళు తన తలపై జల్లుకొనెను. విష్ణుపాదోదకమును శిరస్సున పరమ శివుడే ధరించును. ఇక బలి తన తలపై ఆ విష్ణు పాదోదకం చల్లుకొనుటలో ఆశ్చర్యమేమున్నది? అట్లు గౌరవించిన బలిచక్రవర్తి ఇట్లడిగెను.

సీ॥ **ఎవ్వరి వాడవు? ఎవ్వండవో వటూ?**
**ఎచ్చోట నుందువు? ఎరుగబలుకు**
**ఇచ్చోటికేతెంచ నెయ్యది కారణ**
**మది నేర్వ కౌతుకంబాయె నాకు**
**తరియించె వంశంబు ధన్యుండనైతిని**
**కడతేరె నా కోరికలు ఫలించె**
**శుభకరంబయ్యేను చూడనా శిఖులెల్ల**
**కళ్యాణములు పెక్కు కలుగు జుమ్మి!**



ఆ॥ **నిన్ను జూచినాక నిజముగ భూసురా!**
**జన్మధన్యమయ్యె శాంతి కలిగె**
**పేదవాడు బొందె పెన్నిధియట్లయ్యె**
**ఏమి చెప్పమందు వింక నన్ను?**

(పోతనగారి "వడుగా ఎవ్వరి వాడవెవ్వడవు" ఆధారంగా)

తా॥ ఓ వటువా! నీవు ఎవ్వరవు? ఎవ్వరి వాడవు? ఎక్కడ వుంటావు? నాకు తెలియజెప్పుము. ఇక్కడికి వచ్చుటకు కారణమేమి? ఇది తెలుసుకోవాలని కుతూహలముగా ఉంది. నిన్ను జూచి ధన్యుడనయ్యాను. నా వంశమంతా తరించింది. నా కోరికలు కడతేరి ఫలించాయి. నా యాగములన్నీ సఫలీకృతమయ్యాయి. దానివల్ల నాకెన్నో శుభములు కలుగుతాయి. ఓ బ్రాహ్మణ బాలకా! నిన్ను జూచి నా జన్మ చరితార్థమయింది. శాంతి లభించింది. పేదవానికి పెన్నధి దొరికినట్లయింది. ఇంకా నన్నేం చెప్పమందువు?

నీకు నా సంతోషంకొద్దీ ఏమిమ్మాంటావు? వస్త్రములు కావలెనా? ధనము కావలెనా? వన్యములు కావలెనా? రత్నములు కావలెనా? రధములు కావలెనా? మృష్టాన్నములు కావలెనా? కన్యలు కావలెనా? గజములు కావలెనా? అంతులేని బంగారము కావలెనా? చూడముచ్చటైన గృహములు కావలెనా? అగ్రహారములు గ్రామములు కావలెనా? భూములు కావలయునా? ఇవి కాక మరింకను అన్యములేమైనను కావలెనా? ఏమి కావలయునో కోరుకొనుము. నీ వడిగిన దానిని తప్పక నీ కానందము కలుగునట్లు ఇచ్చెదను. సంకోచించకుము అని బలిచక్రవర్తి చెప్పినదంతయు విని వామన రూపధారియైన ఆ సర్వేశ్వరుడిట్లనెను.

**సీ॥ నాచోటు ఇదియని నేచెప్పజాలను**
**జగమంతనుందును శంకయేల?**
**నావారు ఎవరని నయముగ బలుకుదు**
**ఎల్లరు నావారె ఇది నిజంబు**



**నా నడవడి యేది? నేనేమి వినిపింతు?**
**మూడు రీతుల నేను బోదు ననఘ!**
**నేర్చితి వేమన్న నేనేమి వచియింతు**
**నేర్వదగినదెల్ల నేనె జుమ్మి!**

**ఆ॥ హితులు నాకులేరు హితుడనే జగతికి**
**చుట్టమొకడు లేదు చూడ నాకు**
**తొల్లి సిరియుగలదు తొలగిపోయెను నేడు**
**సాధుజనులయందు జతగనుందు.**

(పోతనగారి “ఇది నాకు నెలవని....” ఆధారంగా)

తా॥ ఓ బలిచక్రవర్తీ! ఇది నాచోటు అని చెప్పలేను. ఎందుకంటే ప్రపంచమంతా నేను ఉంటాను. (నిత్య సంచారిని). నావారు ఎవరని చెప్పమంటావు నిజంగా అందరూ నావారే. (భిక్షువుకి అందరూ చుట్టాలే). నేనెట్లా నడుచుకుంటానంటే ఏం



సమాధానం ఇవ్వను? (సత్త్వరజస్తమో గుణములు కలవాడను). నేనేం నేర్చుకున్నానో చెప్పమంటే ఏమంటాను? ప్రపంచంలో నేర్వదగినదంతా నేనే (లోకజ్ఞానం పుష్కలంగా ఉన్నది). నాకు హితుడెవ్వడు లేడు కాని జగత్తు అంతటికీ నేనే హితుడను (నేను భూసురుడిని గదా!). బంధు వెవ్వడూ లేడు నేనే అందరికీ బంధువును. ఇదివరకు సిరి ఉండేది. (ఒకప్పుడు లక్ష్మీపతినే) ఇప్పుడు లేదు. సజ్జనులతోడుంటాను. (అంతరార్థం గమనిస్తే నేను శ్రీమన్నారాయణుడను అని తేటతెల్లమవుతుంది)

**ఓ రాజా! నీవు సత్యవచనుడవు. నీ వంశమునకు తగిన కీర్తినిచ్చునది అదియే. ధర్మసమ్మతమైన ఆ నిష్ఠయే మీ వారందరినీ జగద్విఖ్యాతులను చేసినది. తత్త్వమూర్తులైన మీవారిలో యుత్తమ గుణములేనివారు లేరు. రణభీరువు యెవ్వడూ మీవారిలో లేడు. మీ ప్రత్యర్థియైన మిమ్మల్ని యాచిస్తే వానిని తృప్తిపరచక**



**పంపరు. మీ తాతగారైన ప్రహ్లాదుని కీర్తి ఆకాశంలో చందమామవలె కాంతి చంద్రికలు విరజిమ్ముతుంటుంది. మీ వంశం క్షీరసాగరంవలె వెలయచుండును.**

**పూర్వము మీ ముత్తాత హిరణ్యాక్షుడు విశ్వ విజేతయై శత్రువను వాడులేక విచ్చలవిడిగా సంచరించుచుండగా విష్ణువు వరాహరూపమున అతనిని తుదముట్టించెను.**

**ఇక ఆతని సోదరుడైన హిరణ్యకశిపుడు బ్రహ్మదేవునిచే విచిత్రమైన పెక్కు వరములను పొంది విష్ణువుని నిర్జించెదనని వైకుంఠముపై దండెత్తెను. విష్ణువు అతని నెదిరించలేక మాయోపాయముతో నాసికా రంధ్రముల ద్వారా అతి సూక్ష్మరూపమున అతని హృదయమును చేరుకొని అక్కడే భద్రముగా దాగియుండెను. పదునాల్గు భువనములను గాలించి వెతికినా అతనికి శ్రీహరి కనిపించకుండెను. సముద్రములన్నియూ వెదకెను. ప్రయోజనములేక భయపడి పారిపోవుచూ ఎక్కడో మరణించి యుండునని తలంచి మరణించినవానిపై**

వైరము బూనుట తగదని విరోధము మానివేసెను. అంతటి ఘనుడు మీ ప్రపితా మహుడు.

అది అటుండనిమ్ము. నీ తండ్రి సామాన్యుడను కొంటివా? దీనులైన బ్రాహ్మణులవలె ఇంద్రాది దేవతలు తనను ప్రార్థించగా వారిని చంపక ప్రాణములతో విడిచి పెట్టెను.

ఇక నీవు ఈ వరకే ముల్లోకములను జయించి పాకారిని స్వర్గమునుండి వెడలగొట్టితివి. దానగుణమున నీకు సాటియైన వాడు లేడనిపించితివి. పిశాచ రాక్షసాది గణములను రక్షించుటకు విశేష శ్రమ నొందితివి.

ఇంకొక మాట వినుము. రాజ్యము ఉన్నందులకు పూజ్యులైన వారికి లేదనక యాచించినది ఈయవలెను. భూసురులకు దానమీయని వాని సంపదలును జన్మమును వ్యర్థములు. త్యాగమూర్తులను లెక్కించినపుడు ముల్లోకముల లోను నీపేరే మొట్టమొదట వచ్చును.



చం॥ వినుమిది ఏల నాకు సిరి, విత్తము? యొంటరి
బ్రహ్మచారికిన్
అనవసరంబు గావె? అవి వ్యర్థము దానవనాథ!
ప్రీతిచే
ఘనముగ మూడు పాదములు గప్పెడి నేలను
నాజపంబుకై
అనువుగ నిమ్ము, చాలునది అంతటి విశ్వము
ఇచ్చినట్లగున్.

(పోతనగారి "ఒంటరి వాడనాకు....." ఆధారంగా)

తా॥ ఓ దానచక్రవర్తీ! ఒంటరి బ్రహ్మచారిని. బాలుణ్ణి నాకు సంపదలు, ధనము ఎందుకు? అనవసరం కదా! సంతోషంగా ఒక మూడడుగుల స్థలం ఇవ్వు. జపము చేసుకుంటాను. అది చాలు నాకు ఈ విశ్వమంతా ఇచ్చినట్లు భావిస్తాను.

పొట్టి బ్రహ్మచారి పలికిన పలుకులు విని గొప్ప దాతయగు బలిచక్రవర్తి ఇట్లనెను. **"ఓ మహాత్మా! నీవు**



చెప్పినదంతయు సమంజసముగానే యున్నది. కాని మూడడుగుల నేల నడుగుట బాగుగాలేదు. దానమడుగు వారు దాతయొక్క గొప్పతనమును గమనించి యడుగవలెను. మూడడుగుల నేలనీవడుగుట నాకే చిన్నతనముగా నున్నది. నీవు గొప్ప భూములను గాని, గజములను గాని, కన్యలను గాని, కోరవలసినది. బాలుడవు గాన నీకు కోరదగినదేదో తెలియకున్నది. ఈ అసురేశ్వరుడు గొప్ప సంపదలనిచ్చును గాని స్వల్పమగు మూడడుగుల నేల నిచ్చునా? మేలైనది మరేదయిన గోరుము". దానికి వామనుడు చిరునవ్వుతో నిట్లనెను...

ఓ దానవేశ్వరా! నేను బ్రహ్మచారిని. నాకు గొడుగు, యజ్ఞోపవీతము, దండము, కమండలము. అంతియేకాని అన్యములు వ్యర్థము కదా! గజములను, అశ్వములను, యువతులను నేనేమి చేసుకొందును? నిత్యము బ్రహ్మచర్యోచిత కర్మలను సలుపునాకు ఆ ఐశ్వర్యములతో పని ఏమి? నేను కోరిన మూడడుగుల నేల నిచ్చిన చాలును. అదియే బ్రహ్మాండముగా గ్రహింపగలవాడను.



అంతియే కాక ఓ బలిచక్రవర్తీ! మనిషికి పేరాశ తగదు. తనకు లేదని వగచు వానికి చివరకు మిగులునది లేమి మాత్రమే సుమా! తనకు ప్రాప్తమైనదే పదివేలపాటి అనుకొని తృప్తి పొందని వాడు ఈ సప్త ద్వీపములతో నిండిన భూమండలమంతయు నిచ్చినను తృప్తి చెందడు. ఇంకా వానికి కోరిక తీరదు.

ఉ॥ అంతములేని పాశమది ఆశను గెల్చుట వీలు
కాదయా
ఎంతటి భాగ్యమిచ్చినను ఇంచుక తృప్తినెరుంగ
లేరు, భూ
కాంతులు వైన్యుడున్, గయుడు, గాసిని బొందిరి
గాదె! రాజ!, ఆ
శాంతము జూచిరే! కనుట సాధ్యమె మేదిని
జుట్టి ఇచ్చినన్.

(పోతనగారి "ఆశాపాశము దాగడున్...." ఆధారంగా)

తా॥ ఓ రాజా! ఈ 'ఆశ' అనునటువంటిదొక అంతులేని బంధనము వంటిది. దానిని జయించుట సాధ్యం కాదు. ఎంత సంపద ఇచ్చినా కొంచెమైన తృప్తి నెరుగనిది. రాజశ్రేష్ఠులయిన వైన్యుడు, గయుడు వంటివారు శ్రమపడ్డారే కాని ఆశకు తుదిని కనుగొన గలిగారా? అది సాధ్యమా? ఈ భూమండలమంతా ఒకేసారి ఇచ్చినా తృప్తి కలుగుతుందా?

**ఈ మూడు లోకాలలోను పూజనీయుదెవరంటే సంతృప్తి కలిగినవాడు మాత్రమే. అతడొక్కడే సుఖించును. అతనికే ముక్తి లభిస్తుంది. యాదృచ్ఛికముగ లభించిన దానితో తృప్తి చెందు వాని తేజస్సు దినదిన ప్రవర్ధమానమగుచుండును. సంతోషము లేనియెడల జలధారవల్ల అగ్ని నశించినట్లు సమసిపోవును. నీవు రాజువు కదా అని సర్వస్వము నడిగినను ఈయగలవు దాతవని తెలిసియు నీ సర్వస్వము నడుగుట న్యాయమా? నాకు తగిన రీతిని నేను యాచించితిని. నేను కోరిన**



**మూడడుగుల నేలను ఇచ్చిన చాలును. అంతకంటె ఎక్కువ అక్కరలేదు.**

ఆ పొట్టి వటువు అట్లు చెప్పగా బలిచక్రవర్తి అతను కోరినది దానమీయుటకు జలధార నతని చేతిలో పోయుటకు జలకలశమును జేతిలోనికి తీసికొనెను. వెనువెంటనే రాక్షస గురువైన శుక్రాచార్యుడు బలిని వారించుచూ ఇట్లు బలికెను.

**"దానవనాథా! ఈ వటువు బడుగు బ్రాహ్మణుడు గాడు. దేవతల కార్యము సాధించుటకేతెంచిన శ్రీహరి. అదితి గర్భమున జన్మించిన యీతనికి నీవు దానమొసగిన నీ ఐశ్వర్యమునంతయు హరించును. నీతేజస్సును బలమును నీ నెలవును గూడ ఆక్రమించును. వ్యాప్తి జెందువాడు విష్ణువు. ఈతడు నీవు దానమిచ్చినచో ముల్లోకములలో వ్యాపించు విశ్వంభరుడై ఒక్క పాదముతో పూర్తి భూమండలమును వేరొక్క పాదముతో త్రిదివములను ఆక్రమించును.**



ఇచ్చెదనిని చెప్పి పిదప ఈయకుండుటచే నరకము ప్రాప్తించును. నిజమే. కాని నీవు ఆ నరకము నధిగమించగల సామర్థ్యము గలవాడవు. ఏ దానము **వలన తనకు నాశము ప్రాప్తించునో అది దానమే కాదు అని పెద్దలందురు. తాను ధనవంతుడై యున్నప్పుడు మాత్రమే దానమును, యజ్ఞమును, తపస్సును, కర్మమును గూర్చి యోచించవలెను.**

ఎవడైనను **తనవద్దగల ధనమునంతయు ఐదు భాగములుగా విభజించి, ఒక భాగమును కామము దీర్చుకొనుటకు, ఒక భాగము సంపదనభివృద్ధి చేయుటకు, ఒక భాగము ధర్మము నెరవేర్చుటకు వినియోగించవలెను. ఒక భాగమును కీర్తి గడించుటకు మరియు ఐదవ భాగమును ఆశ్రితుల కొరకు సమానముగ వ్యయము జేయవలెను.**

**అట్లు జేసినవాడు ఇహపరములను రెంటినీ సాధించగల ధన్యుడును, పరిపూర్ణమైన ఆనందమునను**



**భవించును. ఈ సంగతి చూడక ఇతరులకున్నదంతయు దానమొసగుట చేయవలసిన పనికాదు.**

ఈ విషయమున పెక్కు విధములైన గీతార్థములు **గలవు. సావధానుడవై వినుము. సర్వము నాశనమై పోవునెడల ఈయనని తిరస్కరించుట తప్పుకాదు. అందు అసత్య దోషము లేదు. ఆత్మవృక్షమునకు అసత్యమే మూలము. సత్యము పుష్పఫలములు. పుష్ప ఫలములు లేకున్నను నష్టము రాదు గాని మూలమే (వ్రేళ్ళు) లేకున్న వృక్షము నిలుచునా? తనకు చేటు గాని కొరతగాని జరుగకుండ చూచుకొని ఇచ్చు పురుషుడే చెడక యుండును. నేను ఆడిన మాట తప్పనని ఉన్నదంతయూ పరులకు ధారపోసిన వాడు పొందునది అధోగతియే సుమా!**

ఇదంతయూ అటులుండ నిమ్ము ఈ సూక్తి వచనమును వినుము.

**సీ॥ వనితల గూర్చిన వ్యవహారమందున**
**పెండ్లి పెద్దగ నిల్చు వేళలందు**
**ప్రాణాలు పోవునన్ భయము కల్గినవేళ**
**మాన మర్యాదలు మరులు వేళ**
**విత్తంబు గోల్పోవు వేళలన్నిటియందు**
**ఇక్కట్లలోతాము ఇముదు వేళ**
**గోబ్రాహ్మణులయొక్క కుశలంబు నాశించి**
**రక్షింపు వేళల లక్షణముగ**

**ఆ॥ బొంక వచ్చునట్టి సంకటంబుల నెల్ల**
**తప్పులేదు రాజ! ధరణిలోన**
**తన్ను మాలినట్టి ధర్మంబు లేదయా**
**గురువు మాట వినుము కులము చెడదు.**

(పోతనగారి "వారి జాక్షులందు...." ఆధారంగా)



తా॥ ఓ రాజా! స్త్రీలకు సంబంధించిన వ్యవహారముల యందును, పెండ్లిపెద్దగా వ్యవహరించునప్పుడును, ప్రాణాపాయము సంభవించునప్పుడును, మాన మర్యాదలకు విపత్తు సంభవించునప్పుడును, ధనము గోల్పోయే ప్రమాదం జరుగుతున్నప్పుడు, కష్టాలు సంభవించినప్పుడు, గోబ్రాహ్మణులను కాపాడు సమయమందును తప్పకుండ అసత్యం పలుకవచ్చు. ఇందులో తప్పులేదు. తనను మాలిన ధర్మం తగదు. ఈ గురువు మాట వినుము. రాక్షస కులము చెడిపోకుండా కాపాడుకో.

**ఓ దానవేంద్రా! నీవు కులమును, తేజస్సును, రాజ్యమును నిలుపుకొనుము. ఈ పొట్టివాడు విశ్వభరుడై తక్కువతో తృప్తిజెందువాడు కాదు. త్రివిక్రముడు. ఆ స్ఫూర్తితో బ్రహ్మాండమునంతా నిండినప్పుడు వానిని నిలువరించుట అన్యులకు అసాధ్యము. నామాటలు చెవులారా వినుము. ఈ దానము గీనము చేయవద్దు.**



**ఈ వటువునకు దానమీయకయే పంపివేయుము".** ఈ విధముగా హితబోధ చేసిన శుక్రాచార్యుని మాటలను విని బలి ఒకింత సేపు ఆలోచించి ఆ పిదప వినమ్రుడై ఇట్లనెను.

**"మహాత్మా! నీవు చెప్పిన దంతయూ నిజమే. గృహస్థ ధర్మమదియే. కాని కోరిన ఇత్తునని వాగ్దానము చేసి లోభించి యాచకుని పొమ్మనుట పాపము. తొల్లి భూదేవి బ్రహ్మతో నేనెట్టిబరువునైన మోయగలను గాని అసత్య ప్రలాపి బరువును మాత్రం మోయలేనని పలికినది కదా! మానధనులు, వీరులు రణ రంగములో మరణింతురు కాని వెనుదిరిగి పారిపోజాలరు. అట్లే వారు ఆడిన మాట తప్పరు. మాట నిలుపుకొన్ననే భద్రము కలుగును. కర్షకునకు మంచి పొలము, మేలైన విత్తనములు లభించిన రీతిని నాకు చిత్రముగా దానము చేయునవకాశము తగిన పాత్రము లభించినవి. ఇట్టి భాగ్యమును పోగొట్టుకొనజాలను.**



**ఉ॥ రాజులు కారె? రాజ్యముల లబ్ధిని బొందరె గర్వమెక్కుడై**
**ఏ జతలేని యున్నతుల నేలరె? కల్మిని గొంచు బోయిరే?**
**ఈ జగమందు పేరు సిరులెప్పుడు నిల్చునె మెచ్చరే శిబిన్?**
**రాజుల కీవి శాశ్వతము రాదు మరేదియు వెంట భార్గవా!**

(పోతనగారి "కారే రాజులు రాజ్యముల్...." ఆధారంగా)

తా॥ ఓ భార్గవా! (ఈ లోకములో ప్రజలు) రాజులు కాకుండా ఉంటారా? రాజ్యాలు సమకూరవా? వాళ్ళందరూ గర్వించకుండ ఉంటారా? ఎవరితో సమంకాని ఔన్నత్యంతో రాజ్యం ఏలకుండ యుందురా? (వారెవరన్నా) ఈ సంపద మూట కట్టుకొని పోయారా? ఈ ప్రపంచంలో వారి పేరు, సంపదా ఇప్పుడు నిలిచియున్నాయా? శిబిచక్రవర్తిని

నేటికీ మెచ్చుకుంటారు కదా! రాజులకు కీర్తి శాశ్వతం. అంతేకాని మరేదైనా వారివెంట వస్తుందా? (రాదు)

**ఎడతెగకుండా ఎన్నో క్రతువులను వ్రతములను చేసిననూ భగవానుని సాక్షాత్కారం పొందుట సాధ్యపడదు. సర్వోన్నతుడైన శ్రీహరి అతి పొట్టివాడై నన్ను యాచించ వచ్చెను. ఇట్టి అవకాశము లభించినప్పుడు వదులు కుంటానా?**

**చ॥ కలిముల రాణి కొప్పుపయి, గాత్రముపై తన వల్లెవాటుపై**
**చెలగు పదాళిపై తళుకు చెక్కిలిపై, చనుదోయి పైన తాన్**
**నెలకొను చేయి క్రిందగుట నేర్పుగ నా చెయిపైన యంటమేల్**
**నిలుచునె కాయమెప్పటికి? నిత్యమె రాజ్యము గీజ్యమైననున్.**

(పోతనగారి "ఆదిన్ శ్రీసతి కొప్పుపై...." ఆధారంగా)



తా॥ సిరులమ్మయైన ఆ శ్రీదేవి యొక్క కొప్పుపైన, శరీరంపైన, పయ్యెదపైన, పాదపద్మములపైన, తళతళ లాడు చెక్కిళ్ళపైన, స్తనద్వయంపైన ఉండే ఆ శ్రీమన్నారాయణుని చెయ్యి క్రిందై నాచెయ్యిపైన ఉండుట మేలు కదా! ఈ శరీరం ఎప్పటికీ నిలిచియుండు స్వభావం కలదా? ఈ రాజ్యము గీజ్యము నిత్యమూ ఉంటాయా?

**నాకు నరకము వచ్చినను సరే, దుర్మరణం వచ్చినా సరే, వంశము నిర్వంశమైనను సరే, బంధనము కలిగినను సరే, రాజ్యం పోయినా సరే, నిజముపై నిలువనిమ్ము. వచ్చినవాడు హరి హరబ్రహ్మాదులలో యెవండైనను గానిమ్ము. నామాటకు తిరుగులేదు. నేనాడిన మాటను తప్పను.**



ఇన్ని మాటలెందుకు. నేనతడడిగినది ఇచ్చినప్పుడు విష్ణువు నన్నేల బంధించును? ఒకవేళ బంధించినను కరుణాంతరంగుడైన శ్రీహరి తప్పక విడిచి పుచ్చును గదా! ఒకవేళ విడువడను కొందము, అప్పటికీ నాకు విచారము లేదు. ఎందుకనగా

మేరు పర్వతము తలక్రిందైనను సరే, సముద్రము లింకిపోయినను సరే, భూమి ధూళిగా మారినను సరే, ఆకాశము విరిగి పడిపోయినా సరే, నేనీ యర్థికోరినది ఇచ్చియే తీరుదును.

ఇతడు తానొంటరివాడననియు, ఇంత దనుక ఎవ్వరినీ యాచించలేదనియు, తోబుట్టువులు ఆప్త బంధువులు లేరనియు, సమస్త విద్యలనెరింగిన వాడననియు, పలుకుచు దానము పట్టుటకు చేతులు చాచినాడు. వీనిని తిరస్కరించుటకు నాకు మనస్సెట్లు వచ్చునో నీవే ఆలోచింపుము".



దానము చేయుటకు కృత నిశ్చయుడైన బలిచక్రవర్తి ఇట్లనగా తన మాట కాదన్నందులకు శుక్రాచార్యుడు కోపించి **"నా శాసనమును ధిక్కరించినాడవు గాన నీవు శీఘ్రమే పదభ్రష్టుడవై పోదువు గాక"** అని శపించెను. గురు శాపమునందియు బలి తన నిశ్చయమును విడువ లేదు. మానధనులగు ఉత్తములు ఏవిధముగనైన బ్రతుక గలరు. లేమిని సహింతురు. జీవితము ధనము నశించినను సరే, తమ మాటయందు వెనుకాడరు.

అంత దానవేశ్వరుని ధర్మపత్నియైన 'వింధ్యావళి' ఆ వటుని కాళ్ళు కడుగుటకు స్వర్ణకలశముతో జలమును తెచ్చెను. బలి ఆ వామనమూర్తిని జూచి ''ఓ మాణవకోత్తమా! రమ్ము. నీ వాంఛితము తప్పక నిచ్చెదను. నీ పాదములను కడుగవలెను ఇటు రా రమ్ము" అని పిలువగా శ్రీహరి తన పాదమును చాచెను.

**తే॥ దివిజ లోకముగాచెడి దివ్యపదము**
**నిత్య శ్రీకరంబాగమ నిగమ నుతము**
**భవహరణము జేసెడి విష్ణుపదము నీట**
**తడిపి దైత్యవల్లభుడంత కడిగె తాను**

(పోతనగారి "సురలోక సముద్ధరణము...." ఆధారంగా)

తా॥ ఆ పాదమెటువంటిదంటే... సురలోకమును రక్షించునటువంటి దివ్యమైన పాదము. వేద వేదాంగములు పొగిడే ఆ పాదం సదా వైభవము నొసగునది. ఆ విష్ణు పాదము భవబంధాలను తొలగించునట్టిది. దానిని జలముతో తడిపి ఆ దానవ చక్రవర్తి కడిగినాడు.

ఆ జలమును శిరస్సుపై జల్లుకొనెను. ఆ పిదప ఆ పాదజలమును ఆచమనము చేసి, "విప్రాయ ప్రకట



వ్రతాయ, విష్ణు స్వరూపాయ వేద ప్రామాణ్య విదే తుభ్యం పాదత్రయ ధరణిం దాస్యామి' అని చేయిజాచి, పూజించి "బ్రహ్మార్పణమస్తు" అని మూడడుగుల నేలను దానము జేసెను. అప్పుడు భువనములన్నియు మిక్కిలి ఆశ్చర్యపడినవి.

కం॥ పుట్టిన పిమ్మట నేర్చెనొ
పుట్టకయే నేర్చినాడొ పురుషోత్తముడీ
పుట్టెడు బుద్ధుల బొట్టికి
దిట్టత దానంబు నిచ్చె ధీమణి బలియున్.

(పోతనగారి "పుట్టినేర్చికానెనొ..." ఆధారంగా)

తా॥ పురుషోత్తముడైన ఆ వామనుడు ఈ శాస్త్ర విహితములన్ని పుట్టిన తరువాత నేర్చాడో పుట్టకుండానే నేర్చాడో తెలియదు. పుట్టెడు బుద్ధులున్న ఈ బుడుతడికి బలిచక్రవర్తి ధైర్యంతో కోరింది దానమిచ్చాడు.



ఆ సమయమున కలశమునుండి జలధార పడకుండా శుక్రుడు అడ్డము పడెను. అది తెలిసిన వామనుడు కుశాగ్రమున (ధర్భపుల్ల మొనతో) రంధ్రమును పొడిచెను. అప్పటినుండి శుక్రాచార్యుడు ఏకాక్షి అయ్యెను. బలిచక్రవర్తి భూదానమొనరించుచు నీటి ధారను పోయగా శ్రీహరి దానిని గ్రహించుటకు హస్తమును జాచెను.

దానము పట్టువాడు శ్రీహరియనియు దానివలన తనకు నాశనము తప్పదని యెరింగియు ప్రీతితో దానమిచ్చిన బలివంటి దాత మరియొకడుండడు. భూదానము నిచ్చినవాడే కాక పట్టినవాడు కూడ పాపవిరహితుడై నూరేండ్లు స్వర్గమున ఇంద్రభోగముల ననుభవించును. కావున భూదానమునకు ఏదానము సాటిరాదు. **''నీవు భూదానమిచ్చితివి గావున ఉభయలోకములందు కీర్తిని సుకృతమును పొందుదువు గాక! మూడడుగుల నేల వేడితివేమి? అని మనస్సులో సంకోచముతో ప్రశ్నింపక ధార పోయుము. సత్యము దప్పక వేడిన దానిని ఇచ్చుట మాకు ముల్లోకములను**



**ఇచ్చునట్టిది. మిక్కిలి సంతసించితిని"** అని వామనుడు పలుకగా బలి పరమానంద భరితుడాయెను. ఆ పొట్టివాని పుట్టెడు బుద్ధులకు నవ్వుచూ దానమొసగెను.

బలిచక్రవర్తి వామనునికిట్లు భూమిని ధారాదత్తము చేయగా గ్రహములు, మునీంద్రులు, సిద్ధులు, గంధర్వ, కిన్నెర, యక్ష, పక్షి, నాగులే కాక దేవతలు కూడ అతని త్యాగమును స్తుతించిరి. పుష్పవర్షము కురిసెను. దేవదుంభులు మ్రోగెను. దానము పరిగ్రహించిన కొంత సేపటికి ఆ వామనుడు...

**ఉ॥ ఇంతకు మించిపోయి హరి ఇంతకు నింతయి**
**వ్యోమసీమలో**
**అంతయి చంద్రమండలము నాకస వీధిని**
**దాటి ఆ ధ్రువున్**
**చెంతకు చూచుచుండగనె చేరెను, దాటెను**
**సత్యలోకమున్**
**అంతటి విశ్వమున్ వటువు ఆ క్షణమందున**
**నాక్రమించెతాన్.**

(పోతనగారి "ఇంతింతై వటుడింతై...." ఆధారంగా)

తా॥ ఆ శ్రీహరి ఇంతవాడు ఇంతింతై విను వీధిలో అంతై చంద్రమండలమంతై ఆకాశ వీధిని దాటి ఆ తరువాత ధ్రువమండలమంత ఎత్తుకు ఎదిగి చూస్తుండగానే సత్యలోకము చేరి దానిని కూడ దాటిపోయి ఆ క్షణంలోనే ముల్లోకములతో నిండిన విశ్వమంతయు విస్తరించి ఆక్రమించెను.

**ఉ॥ ఆ రవిబింబమా వటుని కాయెను ఛత్రము రత్నమై తలన్**
**చేరెను, కర్ణమందెసగె, శీఘ్రుమె కంఠపు హారమయ్యె, కే**
**యూరముతోపె కంకణము, ఒప్పెకటిన్ చిరుగంట వోలె తా**
**మారెను నూపురంబువలె పాదపు పీఠిక ఆయె చూడగాన్**

(పోతనగారి "రవిబింబంబుపమింప...." ఆధారంగా)



తా॥ ఆ సూర్యబింబం ఆ వటువు పెరిగిపోతుంటే మొట్టమొదట గొడుగువలెను, శిరోమణివలెను, అతి వేగముగ కంఠహారమువలెను, భుజకీర్తులలో ఒకదానివలెను, కంకణమువలెను, నడుమునకు కట్టుకున్న చిరుగంటవలెను, నూపురమువలెను, పాదపీఠికవలెను గోచరించెను. (వామనుడు పెరిగిపోతుంటే నేలపై నుంచి చూస్తే సూర్యబింబం పైన వర్ణించిన విధంగానే కనుపిస్తుంది.)

ఈ విధముగా మహావిష్ణువు వామన స్వరూపమును విసర్జించి గుణత్రయాత్మకంబైన విశ్వరూపమును ధరించి భువిని, ఆకాశమును, దిక్కులను, విదిక్కులను, సముద్రములును, భూతనివాసములను తానెయై క్రమక్రమముగా భూలోకమును దాటి, భువర్లోకమునతిక్రమించి, జనోలోకమునకు మీదై తపోలోకమును మీరి, సత్యలోకముకంటెను ఔన్నత్యము ప్రాప్తించి ఎక్కడను రంధ్రములు గాని సందులు గాని లేకుండా అంతటను నిండిపోయెను. అనంతమైన దేహము



కలిగి పాదములకింద రసాతలము, పాదములందు భూలోకము, జంఘములందు పర్వతములు, జానువులందు పతత్రి సమూహము, ఊరువులందు ఇంద్రసేన మరుద్గణములు, వాసస్థలమున సంధ్యయును, గుహ్యమున ప్రజాపతులును, జఘనమున దనుజులును, నాభియందు నభమును, ఉదరమున సప్త సముద్రములను, ఉరస్సున నక్షత్రములను, హృదయమున ధర్మమును, ఉరోజములందు ఋతసత్యములను, మనస్సునందు చంద్రుడును, వక్షస్థలమున లక్ష్మీదేవిని, కంఠమున సామవేదము మొదలైన నాలుగు వేదములును, భుజములందు ఇంద్రాది దేవతలును, కర్ణములందు దిక్కులును, శిరస్సున నాకమును, శిరోజములందు మేఘములును, నాసాపుటములందు ఆయువును, నయనములందు సూర్యుడును, వదనము నందు అగ్నియు, మాటలయందు సమస్త ఛందస్సముదాయమును, నాలుకయందు వరుణుడును, కనుబొమలయందు విధి నిషేధములును, రెప్పలయందహోరాత్రములును,



లలాటమున క్రోధమును, పెదవులయందు లోభమును, స్పర్శమునందు కామమును, రేతస్సున జలమును, ఛాయలందు మృత్యువును, నగమున అనేక మాయా విశేషములను, రోమములందు ఓషధులను, నాడీ ప్రదేశమున నదులును, నఖములందు శిలలను, బుద్ధియందు బ్రహ్మయును, ప్రాణములందు దేవర్షిగణములును, గాత్రమున స్థావర జంగమ జంతు సముదాయమును, గలిగియుండెను.

అతడు మేఘ గంభీర ధ్వనిగల పాంచజన్యమను శంఖమును, సుదర్శనమను చక్రాయుధమును, శార్ఙ్గము అను ధనస్సును, కౌమోదకమను గదను, నందకమను ఖడ్గమును, అక్షయమైన అంబులపొదిని, మకర కుండల కేయూరాది హారములన, కౌస్తుభరత్నమును, మణిమేఖలను, అంబర అనువనమాలికను ధరించి విరాజిల్లుచుండెను. నంద, సునంద, జయ, విజయులు మొదలైన విష్ణుగణములు ఆస్వామి చుట్టూ చేరియుండిరి.

అంతులేని తేజోరూపియై విరాజిల్లుతున్న ఆయన బ్రహ్మాండమంతయు తన శరీరపుటాచ్ఛాదనము వలె వెలసి విజృంభించి యుండెను.

ఆ విధముగ శ్రీహరి ఒక పాదముతో భూమండలమును, వేరొక పాదముతో మీదిలోకముల నన్నింటినీ ఆక్రమించెను.

ఒక పాదము క్రింద నున్న భూమి పద్మము క్రిందనున్న పంకమువలె నుండెను. ఆకాశము వేరొక పాదము మీదనుండి పద్మము నంటియున్న తుమ్మెదల గుంపువలెనున్నది. లోకముల నన్నింటిని దాటి మీదకి పోయిన త్రివిక్రముని కాలిగోళ్ళ కాంతి పుంజమున బ్రహ్మయొక్క తేజస్సు కూడ వెలవెలబోయెను. సూర్యుని తేజస్సు ముందు దివిటీవలె వెలవెలబోయెను.

సంసార బంధవిముక్తులై బ్రహ్మలోకమున నివసించు రాజులు, మరీచి మున్నగు మహనీయులు, సనక సనందనాది యోగీశ్వరులు, జ్ఞానాగ్నిలో కర్మలు దగ్ధమైన



మహానుభావులు అనేక పురాణ సంహితాదులను నేర్చినవారును, విశ్వరూపము దాల్చిన శ్రీహరి పాదకమలమును గాంచి మిక్కిలి భక్తితో మ్రొక్కి పెన్నిధానమును జూచితిమని మనస్సులలో తలచుచు మిక్కిలి సంతసించిరి. అతని నాభియందున్న కమలమును గాంచి బ్రహ్మదేవుడు అది తన పుట్టినిల్లని గ్రహించి ఎంతో ఆనందమును పొందెను. ఉన్నతమైన ఆపాద కమలంబును బ్రహ్మతన కమండలములోని జలంబుతో కడుగ ఆ పాదజలమును తనపై జల్లుకొనగా అదే ఆకాశ గంగయై ప్రవహించినది. ఆ బ్రహ్మాదులు అనేక దివ్య పూమాలలతో పూజించి, దివ్యగంధములను సమర్పించి, ధూప దీపములను ఇచ్చి, లాజాక్షతలు చల్లి, ఫలములను నివేదించి, స్తుతులను పాడి, శంఖధ్వనులతో జయ ఘోషల నొనర్చి, "కరుణా సముద్రుడవగు త్రివిక్రమా!" అని కొనియాడిరి.

వనచరులకు అధినాధుడైన జాంబవంతుడు భేరీ ధ్వనుల నొనర్చుచు "త్రివిక్రమ విజయము" ను నలు



దిక్కులందును చాటెను. లోకములన్నింటను తానెయై యున్న లోకనాధుని జూచుటకు కన్నులకు సాధ్యము కాకుండెను. ఊహించుటకు మనస్సునకు చేతకాకుండెను. బలియును, సభాసదులును ఆ త్రివిక్రముని స్తుతించిరి.

అటు పిమ్మట విష్ణుదేవుడు తన విశ్వరూపమును విడనాడి వామన రూపమును దాల్చెను. వెంటనే సభలోనున్న దానవులు పెడబొబ్బలు పెట్టుచు **"ఆహా! మనరాజును అమాయకుని చేసి మోసగించి మూడు పాదముల నేల చాలును బ్రహ్మచారిని అని కపటముతో సత్యసంధుని వంచించి ఈ రాజ్యమును ఆ దేవేంద్రునికి సమర్పించుటకు వచ్చిన వీడు మాయావియైన విష్ణువే. వీనిని పట్టుకొని చావకొట్టుట యుచితము"** అని అరచిరి. ఇదివరలో ఇంద్రుని అవలీలగా ఓడించిన హేతి, ప్రహేతి, విప్రచిత్తియను దానవులు ఆయుధములు ధరించి యుద్ధసన్నద్ధులైరి. వారు గండ్రగొడ్డళ్ళు, పట్టిసము, భల్లములు మొదలైన ఆయుధములను ధరించి విజృంభించిరి.



అది చూచి శ్రీహరి పరిచరులైన సునందుడు, నందుడు, జయుడు, విజయుడు, జయంతుడు, ప్రబలుడు, ఉద్బలుడు, కుముదుడు, కుముదాక్షుడు, గరుడుడు, పుష్పదంతుడు, విష్వక్సేనుడు, శ్రుతదేవుడు, సాత్వతుడు, మున్నగు దండనాధులు మహాబలశాలులు తమ తమ సేనలను ఆయుధములను సిద్ధము చేసికొని రాక్షస సేనల నెదిరించుటకు వచ్చిన విష్ణుసేనను గాంచి, శుక్రుడు తనకిచ్చిన శాపము కార్యరూపము ధరించుచున్నదని గ్రహించిన బలిచక్రవర్తి తన అనుచరులతో ఇట్లనెను.

**"ఓ రాక్షస వీరులారా! ఇది పోరాడు సమయము కాదు. సమస్త ప్రాణుల సంపదలకు ఆపదలకు కారణభూతుడు ఆ శ్రీహరియే. ప్రాణము ఈయవలెనన్నను తీయవలెనన్నను ఆయన సర్వస్వతంత్రుడు. పెక్కు సార్లు మీకు ఓడిపోయి పారిపోయిన విష్ణుభటులు రాక్షసులను తరిమికొట్టునట్లు చేయుచున్నది కూడ శ్రీహరియే. ఇప్పుడు వారి కాలము గావున శ్రీహరి ఆ దేవతలను గెలిపించు చున్నాడు.**

**ఇప్పుడు సామోపాయముతో కాలానుగుణముగ వ్యవహరింతము. మనకు మరల మన ఉన్నతి కాలము ప్రాప్తించును. ప్రస్తుతము వెనుకకు మరలుడు” అని హెచ్చరించెను.**

దానికి రాక్షస వీరులు విష్ణు సేనలకు తలవంచి రసాతలమునకు పారిపోయిరి. శ్రీహరి అభిప్రాయము నెరిగిన తారాక్ష్యనందనుడు బలిని వరుణపాశముతో బంధించెను. కాలు సేతులు బంధింపబడిన బలి **‘భగవంతుని అనుగ్రహమిట్లుండిన ఏమి చేయగలనని’** అట్లె నిలుచుండిపోయెను. దశదిశల హాహాకారములు చెలరేగెను. తన సర్వస్వము నశించి పోయినను విచారములేక ధీరోదాత్తుడై నిలిచిన బలితో శ్రీహిర ఇట్లనెను.

**ఓ రాక్షసేశ్వరా! నాకు మూడడుగుల నేలను ఇత్తునంటివి. ధరణిపై సూర్యచంద్రుల కాంతిపడు నేల**



**అంతయు మొత్తము భూమండలము ఒక పాదమునకు సరిపోయినది. నీవార్జించిన లోకములన్నియు వేరొక పాదమునకు సరిపోయినది. మూడవ అడుగునకు స్థలమెక్కడనున్నదో చూపుము. ఇచ్చెదనని వాగ్దానము చేసి ఈయనని వెనుదిరుగు దురాత్ముడు నరకము పొందును. అది నీవెరుగుదువు. కావున నీవు నరకమునకు పొమ్ము. లేదా మూడవ అడుగునకు స్థలమును జూపుము”** అని పలికెను. విరోచనుని పుత్రుడైన బలి ఏమాత్రము విచారము లేక ప్రసన్నుడై ఇట్లనెను.

**కం॥ నామాట నమ్ము కల్లల**
**నేమైనా పలుకలేను యిక సత్వరమే**
**నీ మూడవ పాదంబును**
**ఓమాధవ! నాశిరమున నుంచుము స్వామీ!**

తా॥ ఓ దేవా! నా నాలుక సత్యమునే గాని అసత్యము పలుకదు. నీకు వాగ్దానము చేసిన మూడవ అడుగు



స్థలము చూపెదను. దానిని నా శిరస్సుపై నుంచుము. నేను నరకమునకు గాని, చెరకు గాని, బంధనమునకు గాని, రాజ్యభ్రష్టత్వమునకు గాని, ఐశ్వర్య నాశనమునకు గాని, కష్టములకు గాని భయపడను. అసత్య దోషమునకు మాత్రమే భయపడుదును.

**తలిదండ్రులు, సోదరులు, సన్మిత్రులు, గురువులు శిక్షించుటకు అర్హులు. అందు తప్పులేదు. తరువాత దానివలన మేలే జరుగును.**

**మేము రాక్షసులము. మదాంధులము. అట్టి నాకు జ్ఞానచక్షువు నొసగిన నీవే గురుడవు. నీవు బంధించినచో అది సిగ్గుపడవలసిన పనికాదు. అందు నష్టము గాని బాధను గాని పొందను. నిన్నెదిరించి పోరాడిన అసురేంద్రులందరు మహాయోగీంద్రులు పొందు స్థానమునే పొందిరి గదా!**



**అందు విచారించవలసినదేమున్నది? నీవు తలచినచో దుర్లభమైనదేమున్నది? ఈ జీవము శాశ్వతమైనది కాదు గదా! ఇది మిక్కిలి అస్థిరమైనది. ఈ విషయము నెరుగక మూఢాత్ములు మాయా సంసారమును స్థిరమని నమ్మి శాశ్వతమైనవి అశాశ్వతములని, అశాశ్వతములు శాశ్వతములని నమ్మి సత్యము, దానము, కరుణ, ధర్మము మున్నగు వానికి దూరమై బాధపడు చున్నారు అందుచేతనే...**

**సీ॥ కొడుకులప్పులవారు కొరగారు బందుగుల్**
**సంసార హేతువు సతియు తాను**
**ధనములు నిలుచునా! తనువు మార్పులు జెందు**
**పనివడి వచ్చుడి వారె హితులు**
**ఆయువు తరుగును, ఆగదు కాలంబు**
**అనికాదె మాతాత అదురు లేక**
**ఎదిరించి తనతండ్రి నెనలేని పేరొందె**
**ప్రహ్లాదుడై హరిభక్తి పొందె**

**ఆ॥ మృతిని యెరుగనట్టి బ్రతుకాయె నతనికి**
**వైరులైరి సులభ తరమనంచు**
**అసురులందుచేత అందిరి నీపొందు**
**భాగ్యమేమి ఇంక వరద! మాకు?**

(పోతనగారి "చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు..." ఆధారంగా)

తా॥ ఓ వరదా! ఈ ప్రపంచంలో మనిషికి కుమారులంతా అప్పులవాళ్ళు. బంధువులెవ్వరూ ఉపయోగపడరు. భార్య సంసారం కొరకు వచ్చినదే కాని వేరుకాదు. ధనము ఎప్పుడూ అస్థిరమైనదే. శరీరం ఎన్నో మార్పులు చెందుతుంది. హితులనబడే వారంతా ఏదో పనికోసం వచ్చేవారె. ఆయువు తరిగిపోతూనే ఉంటుంది. కాలము చూడబోతే ఆగేది కాదు అని కదా మాతాతగారైన ప్రహ్లాదుడు తన తండ్రి



హిరణ్యకశిపుని ఎదిరించి ఏమాత్రం భయంలేక తనహరిభక్తిని ప్రకటించి అంతులేని కీర్తిని పొందాడు. ఎప్పుడూ చిరంజీవిగా ఉండే బ్రతుకు వారికి కలిగింది. ఇదివరలో మా రాక్షసులందరు నీతో శత్రుత్వంతో సులభంగా నిన్ను పొందవచ్చని నీకు వైరులై నీ పొందు అందుకున్నారు.

**అంతకంటే భాగ్యమింకేముంటుంది, స్వామి!** బలి ఈ మాటలు పలుకుచుండగా అతని ఎదుట వాని తాతయగు ప్రహ్లాదుడు గోచరించెను. ఆనంద పరవశుడై అతనికి నమస్కరింప దలచియు బంధితుడైనందున అశక్తుడై సిగ్గుపడి మనోవ్యథ చెంది అవనతవదనుడై తన తాతకు మనస్సులోనే వందన మాచరించెను. సపరివారముతోను సనకసనందనాది ఋషులతోను కూడియున్న వామనమూర్తికి సాష్టాంగ ప్రణామము జేసి ప్రహ్లాదుడిట్లనెను.

**స్వామీ! ఈ బలికి ఈ వైభవము నొసగిన వాడవూ**



**నీవే. నేడు తప్పించినవాడవూ నీవే. పదవి భక్తిని భంగపరచి అహంకారమును పెంచునే కాని ఇంకే విధముగాను సహాయపడదు. ఇతనిని నీవు బంధించినట్లు కనిపించినను అజ్ఞాన పాశమునుండి విముక్తుడిని చేసియుంటివి.**

**తత్త్వజ్ఞానము నెరిగిన వానికి మహేంద్రపదవి ఎందులకు? ఇంద్రపదవిలో కూర్చున్న ఎవనికైనా గర్వముతో కన్నులు కానరావు. చెవులు వినబడవు. మనస్సు గడబిడ జేయును. అతడు నీ సేవలను మరచును. నీవీనాడు నీ మహిమను జూపి మాకు మేలు జేసితివి"** అని వినమ్రుడై నారాయణునికి నమస్కరించెను.

అట్లు ప్రహ్లాదుడు పలుకుచుండగా బలిచక్రవర్తి భార్యయైన వింధ్యావళీ దేవి అచటికేతెంచి వామనమూర్తికి ప్రణమిల్లి **"పద్మాపతే! కోమలమతే! పతి భిక్షాందేహి"** అని **ప్రార్థించి ఇట్లనెను. దేవా! ఈలోకములన్నియు నీకు క్రీడా ప్రాంగణములే. నీవు నిర్మించి ఇచ్చిన ఈ లోకమునకు**



**మూఢమతులైన వారు తామే అధిపతులమనుకొంటారు. నిజమునకు జగన్నాథుడవైన నీకు దానము జేయగల సమర్థుడెవడు? అయినను జీవ భావమున కలుగు అజ్ఞానముచేత నా భర్త నీ వస్తువును నీకే దానమొసగినాడు. కాని ఆయన నీ కోరిక కాదనలేదు. నిన్ను తప్పుపట్టలేదు. నీభక్తులను బాధించలేదు. మాట తప్పలేదు. త్రైలోక్య రాజ్యమును నీకే ఒసగినాడు. అట్టి వానిని బంధించుట న్యాయమా? నీ ప్రియభక్తుడైన ప్రహ్లాదుని మనుమడైన నా భర్తకు ప్రాణ భిక్ష నొసంగుము"** అని అర్థించెను. **బ్రహ్మదేవుడు వచ్చి 'ఓ కమలనాభ! భూతలోకేశ్వరా! దేవవంధ్యా! జగన్నాథా! దానపరుడైన ఈ బలి నీ శిక్షకు అర్హుడు కాదు. ఈతని భయమును తొలగించి వీనిని బంధవిముక్తుని జేయుము. ఇతడు నీ పాదములను భక్తితో కడిగిన క్షణముననే వీని పాపములన్నియూ హరింపబడినవి. నీ పాదములను పూజించు వీనిని మన్నింపుము** అని ప్రార్థించెను.

ఆ మాటలకు శ్రీమన్నారాయణుడిట్లనెను.

సీ॥ కరుణించి యెవరికి వరమీదలంతునో
విత్తంబునంతయు వెడల గొడుదు
సంసార మదముతో సంచరించెడి వాడు
ధిక్కరించుచు నన్ను తిరుగుచుండు
వివిధ జన్మలనొంది విడుపు లేక తపించు
దుర్గతులొందును తుది నెరుగక
వయసు, విద్యయు, రూపు, బలము, ధనంబులున్
మేలు జన్మల, సిరిన్, మించిపోక

తే॥ విడిచి గర్వంబు నెవ్వడు వీడు మదము
వాడు నాయందె ఆసక్తి బడసి యుండు
వాడు చెడిపోడు ఎన్నడీమాట నిజము
వాని రక్షింతు సతతంబు బూని నేను.

(పోతనగారి "ఎవ్వని గరుణింప నిచ్ఛించితి..." ఆధారంగా)



తా॥ పరమాత్మనైన నేను ఎవ్వరిని కరుణించి వరమీయాలని అనుకుంటానో వారి సంపదను హరించి వేస్తాను. సంసార తాపత్రయంతో సంచరించేవాడు నన్ను లెక్క చేయక తిరుగాడుచునే ఉంటాడు. అంతు అనేది ఎరుగకుండా, విరామం లేకుండా రకరకాలైన జన్మలలో నానా అవస్థలు పడుతుంటాడు. వయస్సు, విద్య, రూపము, బలము, ధనము, విశిష్టమైన జన్మ, సిరులతో అహంకరించక ఎవ్వడు గర్వమును, మదమును విసర్జించి యుంటాడో వాడు నాయందే ఆసక్తి కలిగి యుంటాడు. వాడు ఎన్నడు చెడిపోడు. ఈ మాట నిజము. నేను ఎల్లవేళలా అతనిని రక్షింతును.

**ఇక ఈ బలిని అందరూ త్యజించారు. అహంకారం నశించింది. పశ్చాత్తాప దగ్ధుడు. ఐశ్వర్యం నశించింది. పరిశుద్ధుడైనాడు. కరుణ, జ్ఞానము కలిగి పుణ్యాత్ముడైనాడు. అప్రతి హత దానవ చక్రవర్తినన్న భావమే లేక నాపరీక్షకు నిలిచాడు. ఇతడు సత్యవాది, నిర్మలాచారుడు.**



**ఇతడు సావర్ణిమనువు కాలమున (మనం ఉంటున్నది వైవశ్వతమనువు కాలంనాటి కలియుగం) దేవేంద్రుడై ఆ తరువాత వైకుంఠంలో నావద్ద ఉంటాడు. అంత దనుక ఇతడు సుతలమునందు విశ్వకర్మచే నిర్మింపబడిన నగరమున రాక్షసులచే సేవింపబడుచు దివ్య వైభవములననుభవించును, అని పలికిన శ్రీహరి బలితో 'ఓ ఇంద్రసేన మహారాజా! నీకు క్షేమము కలుగును. భయపడకుము. నీ త్యాగము ఎంతో గొప్పది. నీవుండు లోకమున నివసించుటకు దేవతలు కూడ ఉత్సాహపడెదరు. ఆ లోకమున దుఃఖము, బాధ, దుర్మరణము, ఆతురత, నొప్పి ఉండవు. అందరూ నీ ఆజ్ఞాబద్ధులై ఉంటారు. నిన్ను ధిక్కరించిన వారిని నా చక్రము వచ్చి సంహరించు చుండును".**

**"రాజా! అచ్చుటనున్న సంపద లోక పాలకుల వద్ద కూడ ఉండదు. నిన్ను నేనెల్లప్పుడు దయతో కాపాడుదును. దానవులతోను, దైత్యులతోను కలిసి నివసించుట వలన**



**నీకు సంక్రమించిన అసుర భావన క్రమముగా నన్ను ధ్యానించుటచే తొలగిపోవును. కావున నా ఆనతి ననుసరించి ఇకపై సుతలమున నివసించుము"** అని శ్రీహరి పలికెను.

శ్రీహరి అట్లు చెప్పగా, ఆనంద భాష్పములు జలజల కారుచుండగా, నెక్కొన్న వేడుకంద్రొక్కుడు బడుచు చిక్కని చిత్తముతో చక్కని మాటలతో బలిచక్రవర్తి ఇట్లనెను. **"దేవా! లోకపాలకులకు కూడ ఇంత హరికృప లభింపదు. నాపై దయతో నన్ను మెచ్చి తేజస్సునిచ్చి నాకు ఒక లోకమునే ఇచ్చి కరుణించుచున్నావు. నీవు ఇచ్చిన పెద్దరికము నీ మాటలు చాలవా? నిన్నాశ్రయించిన వారికి లోటుండునా"** అని శ్రీహరిని స్తుతించి, బంధవిముక్తుడై అక్కడికి విచ్చేసిన బ్రహ్మమహేశ్వరులకు మ్రొక్కి సుతలమున కరుగుటకు సిద్ధపడెను.

ఇదంతయు జూచి ప్రహ్లాదుడు తన మనుమని భాగ్యమున కానందించి హర్షపులకాంకితుడై శ్రీమన్నారాయణునితో ఇట్లనెను. **"దేవా! బ్రహ్మదేవునికి**

**కూడ ఇట్టి అనుగ్రహము లభించదాయెను. పరమ శివునికి కూడ ఇట్టి సంపద దొరక దాయెను. తొల్లి దేవతలు మునులు నీనుండి పెక్కు ఐశ్వర్యములను పొందిరి. నీకు అసురులు పెరవారు కారనుట కింతకన్న తార్కాణమేమి కావలయును. మామా భాగ్యములను బట్టి కర్మములను బట్టి మమ్ముద్ధరింతువే గాని నీకు పక్షపాతవైఖరే లేదు. దేవదానవులందరూ నీకు సమానమేననుటకు వేరే ఋజువు కావలయునా? అప్లపము, కుత్సితులము దానవులము నీకరుణ పొందుటకేమి నోచితివో తెలియదాయెను. భక్తుల కోర్కెలు తీర్చు కల్పవృక్షమై నీవుండగా మాకేమి కొరత".**

**అంత శ్రీహరి ప్రహ్లాదునితో ఇట్లనియె "నాయనా, ప్రహ్లాదా! శుభమగు గాక! నీవు నీ వారితోను నీమనుమనితోను కలిసి సుతలమునకు పోయి అచ్చట సుఖముగా నుండుము. అచట నెట్టి దుఃఖము, బాధ, ఆకలిదప్పులుండవు".**



అంతనా ప్రహ్లాదుండు తన మనుమనితోను, వాని సేనతోనూ తక్కిన దానవులతోను కలిసి ఆయుధములు వాహనములతో సహా ఒక్క మహాబిలమున ప్రవేశించి దాని ద్వారా సుతల లోకము జేరెను. అంత బ్రహ్మవాదులు అయిన యజకుల సభామధ్యమున కూర్చుండిన శుక్రుని చూచి శ్రీమన్నారాయణుడిట్లనెను.

**"ఓ విప్రోత్తమా! బలిప్రారంభించిన ఈ యాగంబున ఏమి కొరత యున్నదో చెప్పుము. బ్రాహ్మణులు గమనింపగా విషమమయిన కర్మకలాపము సమతను పొందగలదు" అనగా శుక్రుడు "ఓయజ్ఞపురుషా! సమస్త కర్మకలాపమునకు నీవే అధినాధుడవు. నీవే యజ్ఞేశ్వరుడవు. అట్టి నీవే ప్రత్యక్షముగా వచ్చి సంతృప్తి జెందితివి. ఇక యీ యజ్ఞము సఫలము కాకుండునా? ధనమున గాని, దేశకాలములందున గాని, మంత్ర తంత్రములందు గాని ఎట్టి కొరత ఉన్నను నిన్ను స్మరించినంతనే ఆ కొరత తీరిపోవును. నీవెట్లు చెప్పిన అట్లు చేయుదును. నీ యాజ్ఞ పాలించిన మేలే కలుగును**



**గదా! ఇంతకంటే నాకు శుభము మరేమున్నది?"** అని పలికి బలి ప్రారంభించిన యాగమును పూర్తి కావించెను. దానికి తక్కిన విప్రులు మునులు సహాయపడిరి.

వామనుడు బలినుండి తను గ్రహించిన త్రైలోక్య రాజ్యమును తిరిగి తన అన్న అయిన దేవేంద్రునకు సమర్పించెను. కశ్యపాదులు వామనుని ఉపేంద్రుడని కీర్తించిరి.

దేవతలందరూ ఉపేంద్రుని అమరావతికి తీసుకొని వెళ్ళి తల్లివేదన తీర్చుటకు జనించిన వామనుని కొడుకంటే ఇతగాడే అని కొనియాడిరి. బ్రహ్మ ఈశ్వరుడు మునీంద్రులు ఇంద్రుని వాని పరివారమును ఉపేంద్రుని పొగిడి ఆశీర్వదించి వారి వారి నెలవులకు వెడలిపోయిరి.

" సకల సన్మంగళాని భవన్తు"





శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# ౨. భార్గవ రాముని ఉదంతం

మూలం :
**బమ్మెర పోతనామాత్యుడు**

తెలుగు గద్య పద్య రచన :
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.



# ముందుమాట

శ్లో॥ అశ్వద్ధామ, బలి, వ్యాస, హనుమానశ్చ విభీషణ।

కృపః, పరశురామశ్చ, సప్తయితే చిరజీవనః ॥

అని పెద్దలు చెబుతారు. ఏడుగురు చిరంజీవులు ఉన్నారుట. ఈ కల్పాంతం దాక వారు సజీవంగానే ఉంటారని భాగవతుల నమ్మకం.

వీరిలో మన ఈ కథానాయకుడు పరశురాముడు కూడ ఉన్నాడు. భృగు మహర్షికి 'ముని మనుమడు' గా జన్మించిన శ్రీమన్నారాయణుడు 'రాముడు' అనే పేరుతో జమదగ్ని మహర్షికి జన్మించి భార్గవరాముడై పరమ శివుని అనుగ్రహం చేత దివ్యశస్త్రాస్త్రాలే కాక వజ్ర సన్నిభమైన పరశువును (గండ్రగొడ్డలిని) ఆయుధంగా పొందాడు. కార్తవీర్యార్జునుని వంటి దుష్ట రాజులను చీల్చి చెండాడాడు. రక్తవర్షం కురిపించాడు. శ్రీరామచంద్రుని



నిరసించి ఆయనకూడ విష్ణువేయని గ్రహించాడు. ద్వాపరయుగంలో భీష్ముడు, కర్ణుడు వంటి అనేకులకు ధనుర్విద్య నేర్పాడు. నేటికీ మహేంద్ర పర్వతంపై తపస్సమాధిలో ఉన్నాడు.

ఆయన గురించి కర్ణాకర్ణిగా వినటమేకాని భాగవతంలో పెద్దలేం చెప్పారో నాకూ తెలియదు. ఒకరోజు నేను తెలుసుకొని నాబోటి కొందరికన్నా తెలియ చెప్పాలనిపించింది. ఆ ప్రయత్నమే నేడు మీ చేతుల్లో వున్న ఈ పుస్తకం.

నాకు పద్యమంటే వున్న అభిమానంతో పోతనగారి భాగవత 'నవమస్కందం' లోనుంచి పరశురాముని చరిత్ర నెన్నుకొన్నాను. కొన్ని పోతనగారి పద్యాలను తిరిగి వేరే వృత్తంలో వేరే లేకపోతే వచనంలోకి మార్చాను. నేటి



పాఠకుల సౌకర్యార్థం వచనమే ఎక్కువ వాడాను. పద్యాలకు తాత్పర్యం వ్రాశాను. గ్రాంధికమైన 'తెలుగు'కాకుండా వ్యావహారిక తెలుగు వాడాను. పోతనగారి పద్యం ఆధారమైతే ఆ విషయం అక్కడే మనవి చేశాను.

ఈ భాగవత గాథలే కాక, ఇంకా ఎన్నో భగవదారాధనలు, స్తోత్రాలు, కొన్ని అనుసరణలు, కొన్ని అనువాదములు, కొన్ని నా స్వతంత్ర రచనలు చదవండి **www.geetadeeksha.com** అనే నా **'వెబ్‌సైట్'** లో అవి లభ్యమవుతాయి.

## ప్రార్థన

కం॥ శ్రీపతి తామస వృత్తిని
చేపట్టె కుఠారమొకటి చిందులు వేసెన్
భూపతుల నరికివైచెను
ఆ పరశువు దాల్చురాము 'హరికథ' చెబుదున్

ఉ॥ భీమ పరాక్రముండతడు పిల్చిరి భార్గవ రాము దంచు ఆ
నామము విన్నచో వసుధనాధులు పారిరి ప్రాణ భీతిచే
ఆ మహితాత్ముడీ భువిని అంతయు విప్రులకిచ్చె దానమున్
తామసుడైనచో హరికి దక్కక పోయెను పూజ లిమ్మహిన్



సీ॥ కరుణాంతరంగుండు గండ్రగొడ్డలిబూని
శిరసులు పరపర నరికివైచె
దీనోద్ధరుడు యెత్తి దీటుగా చాపమ్ము
శరపరంపరలతో దురిమెనరుల
ఆర్త రక్షకుడాయె అంతక ప్రముఖుండు
ఇరువదొక్కటి తూర్లు ధరను జుట్టె
శాంతమాకృతి దాల్చు శౌరి అశాంతుడై
క్షాత్రధర్మము బట్టి సంహరించె

తే॥ భూసురుల కంత దానమ్ము చేసె భువిని
గురువుగా విద్య నృపులకు గూర్చినాడు
రామచంద్రుని గుర్తించి తామసమును
వీడి తపమాచరించంగ వెడలినాడు.



చం॥ తలపక నేరమున్ పరశు దాల్చిన రాముడు ఘాతుకమ్ముతో
పలువురు భూరమాపతుల పాపుల జంపెను భూసురాళికిన్
కలిగిన భూరమామణిని గ్రక్కున పంచెను, అట్లె తండ్రికిన్
చెలువముతోడ ప్రాణమిడి శ్రీపతి తానని తేల్చి చెప్పెబో.



## అంకితము

బమ్మెర పోతనామాత్యుని దివ్యాత్మకు....



చం॥ పలుకుచునున్న వాడ భగవానుడు విష్ణుని దివ్యగాథలన్
నిలుపుచు నా మనంబునను, నేనును బమ్మెర పోతరాజులన్
తలచుచు స్ఫూర్తిగా, కనుక ధన్యుడనైతిని నాకృతజ్ఞతల్
తెలుపుచు అంకితమ్మునిడి దీనిని దీవెన లందెదన్ భళా!

# భార్గవ రాముని ఉదంతం

శ్రీరామచంద్రుడు దశరథనందనుడు. సూర్యవంశ దీపకుడని తెలియని ధార్మికుడు భారతావనిలో వుండడు. ఈమాట ధైర్యంగా చెప్పవచ్చు. కానీ ఆ శ్రీమహావిష్ణువే శ్రీకృష్ణునిగా చంద్రవంశంలో జన్మించాడు. ఇది మూడు వంతులు జనాభాకి తెలియదు. అదే విధంగా ఆ స్వామి బ్రాహ్మణుడై పుట్టి సగం క్షత్రియుడై క్షాత్రధర్మం నిర్వహించిన వైనం మాత్రం చాల తక్కువమందికి మాత్రమే తెలుసునని జగమెరిగిన సత్యం.

ఈరచన ఉద్దేశ్యం చాలమంది నాలాంటి వారికి తెలియని సంగతుల నెరింగించటమే కనుక, సాధ్యమైనంత సమాచారం సాధ్యమైనంత క్లుప్తంగా ఇవ్వడమే కాబట్టి ఆ భార్గవరాముని (పరశురాముని) ఉదంతం (కథను) మీకందిస్తున్నాను. అవధరించండి...

"సహస్ర శీరషాః పురుషః" అని కీర్తించబడే జగన్నాధుడు శ్రీమహావిష్ణువుయొక్క నాభి కమలమునుంచి



ఆవిర్భవించినవాడు సృష్టికర్తయైన బ్రహ్మ. బ్రహ్మయొక్క మానస పుత్రుడు అత్రిమహర్షి. ఇతడు గుణములలో బ్రహ్మనే బోలియుండెను.

అత్రి మహామునికి ఆ బ్రహ్మ వరప్రసాదమున చంద్రుడు జన్మించెను. అట్లే విష్ణ్వంశమున శ్రీదత్తాత్రేయుడు పరమేశ్వరుడైన శంకరుని అంశమును దూర్వాస మహామునియు జన్మించిరి. ప్రస్తుత కథ చంద్రునిచే ఆవిర్భవింపబడిన చంద్ర వంశజుల గురించి గావున అతి క్లుప్తంగా అదే చెప్తాను.

సప్తఋషులను సృష్టించు ప్రయత్నమున అత్రి తరువాత 'గురుడ' ని ప్రసిద్ధి కెక్కిన బృహస్పతి భృగు మహర్షి వెలసిరి. ఈ భృగుని కుమారుడు శుక్రుడు. ఈయన అతి గోప్యమైన మృతసంజీవిని వంటి విద్యలు నేర్చిన పండితుడు. పూర్వవైరము జేత ఆయనకి బ్రహస్పతి అంటే పడదు.

బ్రహస్పతి వద్ద విద్యనేర్చుటకు జేరిన చంద్రుని



గురుపత్ని తార కామించి ఆమెతో సంబంధం పెట్టుకొనెలా చెరిచింది. ఏ మాత్రము సిగ్గులేకుండా ఆమె చంద్రుని బలవంతంగా తనవైపు తిప్పుకుని ఒక పసిబాలుని ప్రసవించింది. ముద్దులొలుకు ఆ బాలుని కోసం తారను క్షమించుటకు గురుడు సిద్ధపడ్డాడు. కాని వాడు తన కొడుకని పట్టుబట్టాడు చంద్రుడు. వాదోపవాదాలు పెరిగి తార కనిన శిశువుకు తండ్రి ఎవరనే ప్రశ్న ఉదయించింది. ఆ బాధ్యత బ్రహ్మదేవునికి ఒప్పగించారు. ఆమె బ్రహ్మవద్ద శాప భీతిచే తనబిడ్డకు తండ్రి చంద్రుడేనని అంగీకరించింది.

బ్రహ్మ చివరకు ఆ బాలుని చంద్రుని కిప్పించి సమస్యను పరిష్కరించాడు. చంద్రుడు ఆ బాలునికి బుధుడు అని నామకరణం చేసి చేరదీసాడు. బుధుడు అంటే బుద్ధిమంతుడని అర్థం.

బుధుడు 'యిళ' అనే సౌందర్య వతిని పరిణయ మాడెను. వారికి పురూరవుడను పుత్రుడుదయించెను. అతను జగద్విఖ్యాత సౌందర్యవంతుడు, సౌశీల్యవంతుడు,



సమర్థుడు. పురూరవుడు గొప్ప చక్రవర్తిగా ప్రసిద్ధి చెందాడు.

పురూరవుని ఒకనాడు నారదమహాముని ఇంద్ర సభలో పురూరవుని పొగిడాడు. అది విని ఊర్వశి పురూరవుని గాఢంగా ప్రేమించింది. ఇదిలా ఉండగా ఊర్వశి మిత్రావరుణుని శాపము వలన భూలోకమున మానవ యువతిగా జీవితము గడపవలసి వచ్చెను. ఆమె లోకోత్తర సౌందర్యమును గాంచిన పురూరవుడు ఆమెను మోహించి వివాహమాడ గోరెను.

దానికామె మూడు షరతులకు అతనంగీకరించి తననానందపరచినచో అతని కోరిక నెరవేర్చెదననెను. మొదటి షరతు ప్రకారము తన కత్యంత ప్రీతిపాత్రములైన రెండు గొర్రెలను ఎల్లప్పుడూ కాపాడుచుండవలెను. రెండవ షరతు ఏమనగా పురూరవుడు తనకెన్నడూ నగ్నముగా కనిపించరాదు. మూడవ షరతు ఏమనగా ఆమె యిచ్చు ఘృతమును భక్షింపవలెను.

ఆమెపైగల అవ్యాజానురాగమునకు బద్ధుడై పురూరవుడు ఆమె షరతులకంగీకరించెను. ఊర్వశీ పురూరవులు ఇద్దరూ ఏకమై ఆనంద డోలికల తేలియాడుచు పరస్పరానురాగ బద్ధులై యుండిరి. కాలచక్రము అప్రతిహతముగా తిరుగాడుచుండెను.

ఊర్వశి లేక ఇంద్రసభ వెలవెల పోజొచ్చినది. ఇంద్రుడు చేయునది లేక ఊర్వశి ఎడబాటునకు కారణం తెలుసుకోవాలని కొంతమంది గంధర్వులను ఆ పనికి పంపాడు. వారు జరిగిన కథ తెలుసుకొని ఊర్వశీ పురూరవులను విడదీయాలని కుతంత్రం పన్నారు. అర్ధరాత్రి వేళ ఊర్వశి పెంచుకుంటున్న రెండు గొఱ్ఱెలను తస్కరించుటకు ప్రయత్నించారు. ఆర్తనాదము చేయుచున్న గొర్రెల అఱుపును విని ఊర్వశి, పురూరవుని వెళ్ళి జరిగిన సంగతి తెలుసుకొమ్మని బ్రతిమిలాడినది. నిద్రావశిష్టుడైయున్న పురూరవుడు లేవలేదు. **అయ్యో! నా బిడ్డల కాపద సంభవించుచుండగా అడ్డుకొనక మొద్దు**



**నిద్దుర బోవుచున్న నీభార్యగా నుండుట కంటే ఒక సమర్థుని ఇంట దాసిగా నున్నను నా గొర్రెలకు భద్రత యుండెడిది అని నిందించింది. నీలాంటి అసమర్థుని చక్రవర్తిగా సృష్టించిన ఆ విధాత కంటె వెర్రిబాగుల వాడుండడని** అవహేళన చేసినది.

ఆ మాటలకు నిదురలేచి రోషపడి మావటి వాని అంకుశపోట్లకు విజృంభించెడి మత్తకరీంద్రమువలె పురూరవుడు సంసిద్ధుడాయెను. ఆ తొందరలో అతను శరీరమునకు చుట్టుకున్న వస్త్రము ఊడిపోయి అతడు దిశమొలతో నిలుచుండిపోయెను. ఊర్వశి వెనువెంటనే **రాజా! ఇప్పుడు నీవు పరాక్రమించినా గొర్రెలను తెచ్చినను లాభము లేదు. ఇక నీతో ఉండజాలనని** ఆమె పురూరవుని విడనాడి వెడలిపోయెను.

ఆ ఊర్వశీ వియోగముతో అమిత దుఃఖాక్రాంతుడైన పురూరవుడు పిచ్చి పట్టినవానివలె తిరుగుచూ ఒకచోట చెలికత్తెలతో సరస్వతీ నదీతీరమున విహరించుచున్న



ఊర్వశిని గాంచి అతిదీనుడై "ఓ ప్రేయసీ! నన్ను విడనాడు అపరాధమేమి జరిగినది? ఇదివరలో మనమెన్ని ఒప్పందములు చేసికొంటిమి? నేను నిన్నెన్నడైనా కాదంటినా. నాబాధ వర్ణనాతీతముగ నున్నది. నేను నిలువలేను, నన్ను కనికరింపుము" అని ప్రార్థించెను.

అప్పుడు ఊర్వశి ఇట్లా అన్నది.

**"ఓ రాజా! మగవానికింత బేలతనము అనుచితము. ఇట్టి మానవ మృగమును స్త్రీలు ఏవగించుకొనెదరు. నేను దేవవేశ్యను. వెలయాండ్ర సంగతి నీకు తెలియదు. వారి మాటలనుండి అమృతము లొలుకును, కాని వారి ఆలోచనలు కార్చిచ్చులు. ఏదో లాభము లేనిదే మన్మథునినైనా సుందరుడని అనరు. ఒకే సమయమున పెక్కుమందిని ప్రేమింతురు. వారి స్వభావము చాల క్రూరమైనది. ధర్మ చింతయే లేక భర్త తోబుట్టువునకైన కీడుజేయగల చపలురు. చంచల స్వభావులైన వారు వాక్కులలో వేదాంత సూక్తులు వల్లించగల చతురులు"** అని చెప్పిన ఆమె పలుకులు ఆతని చెవికెక్కలేదు.



భగవన్నిర్ణయము మార్చుట ఎవరి తరమూ కాదని గ్రహించినదై ఊర్వశి చివరికి ఇట్లు పలికెను. **"ఓ రాజా! సరిగా ఒక సంవత్సరము గడచిన పిదప నీకు నా పొందు దక్కును".**

పురూరవుడట్లే ఒక సంవత్సరాలము వేచి యుండెను. ఒక్కరాత్రి ఆమె పొందు లభించెను. తృప్తి నొందని అతనితో "రాజా! నేను గంధర్వాధీనను, నీవు వారిని ప్రార్థించి నన్ను గైకొనుము" అన్నది. అతడట్లు ప్రార్థించగా గంధర్వులాతనికి ఒక అగ్నిస్థాలిని (పాత్ర) నొసంగిరి. దైవ వశమున ఆ అగ్నిస్థాలిని పురూరవుని కన్నులకు ఊర్వశి వలెనే కనపడినది. దానితోనే అతడు కొన్నాళ్లు వనవిహారము జేసెను. అతని భ్రమ అటువంటిది.

కాని ఒకనాడు నిజము గ్రహించి ఆ రాజు అగ్నిస్థాలిని నక్కడే పడవేసి తన రాజధానికి వెడలి పోయెను. అయినను అతడు నిత్యము రాత్రులందు ఊర్వశిని తలంచుచు విరహము ననుభవించెను.

ఇట్లుండగా కృతయుగము సమాప్తమై త్రేతాయుగ మారంభమాయెను. భగవన్నిర్ణయము ప్రకారము ఒకే రూపమున నున్న వేదము పురూరవునకు మూడు వేదములుగా కనిపించినవి. రాజు ఆశ్చర్యపడి తమ అగ్ని స్థలినిని వదలివేసిన స్థలమునకు పోయి చూడగా శమీ గర్భసంజాతయగు అశ్వత్థము కానవచ్చెను. ఆశమీ అశ్వత్థముల చేత రెండు అరణులు కావించెను. ఒక అరణి తానయినట్లు, రెండవ అరణి ఊర్వశియైనట్లు ఊహించుచు రెండు అరణుల మధ్య నున్న కాష్ఠము తమ పుత్రుడని ఊహించుచు మంత్రములను పఠింపుచు అరణులను త్రచ్చుచుండెను.

అంత 'జాతవేదు'డను అగ్ని సంభవించెను. విహిత సంస్కారములొనరింపబడిన ఆయగ్ని ఆ పురూరవునకు తదనంతరము పుత్రునివలె దివ్యలోక ప్రాప్తమును కల్పించెను.

పురూరవుడు ఆ యగ్నిచే వేదమయుడును, యజ్ఞేశ్వరుడును, అనంతుడును అయిన శ్రీహరిని గురించి



ఊర్వశీ ప్రాప్తికై యాగమును చేసెను. అంతవరకు వేల్పుల శ్రేష్ఠుడు పురుషోత్తముడైన శ్రీహరి యొక్కడే దైవము అగ్నియును ఒక్కటియే. ఓంకారమున ప్రణవమొక్కటే అక్షరముండెను. వేదమొక్కటియే యుండెడిది. త్రేతాయుగమావిర్భమైన వెంటనే పురూరవుడు వేదమును మూడిటిగాను, అగ్నిని మూడు విధములుగాను విభజించెను. అశక్తులైన మానవులకు అది వరప్రసాదమయ్యెను. (ఆ కారణం చేతనే ఈ కథ మీకు ఈ విధంగా విపులీకరించబడింది, అని నామనవి)

ఆ విభజన వలన కలిగిన పుణ్యం పురూరవునకు అతని యాగఫలంతో జోడింపబడి గంధర్వలోక ప్రాప్తి ఊర్వశీ సమాగము ప్రాప్తించెను. అతడు కొంతకాలము ఊర్వశితో సుఖించుచుండెను. వారి దాంపత్య ఫలముగా వారికి ఆరుగురు పుత్రులు జన్మించిరి. వారిపేర్లు ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుడు, జయుడు, విజయుడు.



ఇందులో కడగొట్టు వాడైన విజయుని పుత్రునిపేరు భీముడు. భీముని పుత్రుడు కాంచనుడు. కాంచనుని పుత్రుడు హోత్రకుడు అని పేరు పొందిరి. హోత్రకుని పుత్రుడే గంగను పుక్కిటిలో బట్టిన జహ్నుడు. అతని పేరుననే గంగానదికి జాహ్నవి అని పేరు వచ్చినది. జహ్నుని కుమారుడు పూరుడు. పూరుని పుత్రుడే అజకుడు. అజకుని కుమారుడు కుశుడు. కుశునికి నలుగురు పుత్రులు దరియించిరి. వారిపేర్లు కుశాంభుడు, దూర్తకుడు, నశువు, కుశనాభుడు. కుశాంభువుని కుమారుడు గాధి. ఈయన జగద్విఖ్యాతి గాంచిన సంతతిని కన్నాడు. గాధి కుమారుడు శ్రీరామచంద్రమూర్తికే గురువైన విశ్వామిత్రుడు. గాధి కుమార్తె సత్యవతి. ఆమె మనుమడే మన కథానాయకుడైన భార్గవరాముడు. భార్గవ రాముడు శ్రీమన్నారాయాణుని ఆరవ అవతారం. అతని ఆయుధం పరశువు (గండ్రగొడ్డలి) అవడం చేత పరశురాముడని ప్రసిద్ధి చెందాడు.

గాధికి మొదట కుమార్తె సత్యవతి. రాజునకు



ఆమెపట్ల ఎనలేని అనురాగం ఉండేది. ఆమెకూడ విజ్ఞత, సౌశీల్యం, వినయం, సౌందర్యం మేళవించిన బంగారు బొమ్మవంటి కన్యామణి. భృగుమహర్షి పుత్రుడైన ఋచికుడు గొప్ప తపశ్శాలి. ఋచికుడు ఒకరోజు గాధిని సమీపించి **"రాజా! నీకుమార్తెను నాకిచ్చి వివాహం చేసిన నీకు సర్వశుభములు కలుగును నా మాట నమ్ము"** అన్నాడు. ఋచికుడు తన పుత్రికకు తగిన వరుడే కాదని తెలిసి కూడ ఋచికుడు శపిస్తాడేమో ననే భయంతో సత్యవతిని ఇవ్వటానికి షరతు పెట్టాడు. కన్యాశుల్కంగా వెయ్యి అశ్వముల నిమ్మన్నాడు. అవి తెల్లటి గుర్రములై యుండవలెను. వాటికి నల్లని చెవులుండవలెను. ఋచికుడు ఇది మానవ మాత్రులవల్ల అయ్యే పని కాదని వరుణదేవుని ప్రార్థించి గాధి షరతును నెరవేర్చాడు.

గాధికి ఆయనకు కన్యాదానం చేయక తప్పలేదు. సత్యవతి తెలివిగలది కనుక తన సౌశీల్యంతో భర్తను మెప్పించింది.

కొంతకాలం జరిగినది. సత్యవతియు ఆమె తల్లియు, తమకు పుత్ర సంతానము లేదని తల్లడిల్లసాగిరి. దానికి తగిన యాగము తమతో చేయించమని ఋచికుని ప్రార్థించిరి. దానికా మహాముని సమ్మతించి తనతోపాటు తన మామగారైన గాధిచే కూడ ఒక గొప్ప యాగమును చేయించెను. యాగానంతరము ప్రసాదమును రెండు వేర్వేరు 'చరువుల'లో సిద్ధము చేసి స్నానము చేయుటకు బోయెను.

ఋచికుడు తిరిగి వచ్చులోపల ఋచికుని అత్తగారు తన కూతురిని త్వరగా ఒక చరువును ఇచ్చివేయమని బలవంతము చేసెను. తల్లిమాటను కాదనలేక ఆ రెండింటిలో ఒక చరువును తీసి ఆమె తల్లికీయగా తల్లి దానిని తినివేసినది. ఇంతలో అక్కడికి వచ్చిన ఋచికుడు కోపించి...



**చం॥ త్వరపడి పోతివా 'చరువు' భామరొ! తల్లికి నిశ్చయంబయెన్**
**చరువులు మార్పిడయ్యెనిక సందియమేటికి నీకు క్రూరుడౌ**
**నరపతి బోలువాడొకడు నందనుడై జనియించు నవ్విధిన్**
**తరుగని బ్రహ్మతేజుడయి తల్లికి 'గాధి' జనించు తథ్యమౌ**

(పోతనగారి "తల్లి చరువునీవు దాల్చి"... ఆధారంగా)

తా॥ ఓ సత్యవతీ! నీవు అనవసరంగా తొందర పడ్డావు. నీ తల్లికి చరువుముందే నిశ్చయమై పోయింది. ఇప్పుడు చరువులు మారిపోయాయి. నిస్సందేహంగా నీకు క్రూరుడైన, రాజసం గల పుత్రుడు జన్మిస్తాడు. నీ తల్లికి అంతులేని బ్రహ్మతేజస్సుగల కుమారుడు గాధి జన్మిస్తాడు. (చరువు అంటే హవిస్సు అంటే యజ్ఞ ప్రసాదము)



దానికామె దుఃఖించి **అయ్యో! నాథా! ఎంత ఘోరము జరిగింది. క్రూరుడైన పుత్రుని కనుటకంటే స్త్రీకి గొడ్రాలి తనమే నయము కదా! నాకా దుర్గతి వలదు. పైగా నా తప్పిదమునకు శిక్ష మీరేల అనుభవింపవలెను? నన్ను కనికరించి మార్గాంతరము సెలవిండని** ప్రాధేయపడెను.

ఘటనా ఘటన సమర్థుడైన ఋచికుడు తల్లి తప్పిదమునకు తనయను బాధించుట న్యాయము కాదని యోచించి **'సత్యవతీ! నీ బిడ్డ సప్తఋషులలో గణింపదగ్గవాడగును విచారింపకుము. కాని నీ మనుమడు మాత్రము క్రూరుడైన హంతకుడగును. అతని వలననే నీకథయును భావి లోకాలకు సుపరిచితంబగును.**

**"సాధ్వీ! ఇంత సున్నిత మనస్కురాలవు గాన పాపము స్వార్థ చింతన నీలో లేనందువలన నా తపో శక్తిని ధారపోసి నేనిట్లు చేస్తున్నాను. నీకు ఇంకొక వరం ప్రసాదిస్తున్నాను. నీవు లోకపావనియైన కౌశికీ నదిగా అవతరించి ప్రజలకు పాపవిముక్తిని కలిగింతువు గాక",** అని ఆశీర్వదించాడు.



ఆమెకు జమదగ్ని అనే పుత్రుడు పుట్టాడు. జమదగ్ని మహా తపోనిధి. ఆయన రేణువుయొక్క కుమార్తెయైన రేణుకను పరిణయమాడి వసుమనాదులగు కొమరులను పొందెను. వారిలో రాముడు అనెడివాడు కడగొట్టువాడు. చరువులమార్పిడిచే బుట్టుటచే అతడు క్రూరుడై పగ సాధించు స్వభావము కలిగియుండెను.ఈతడు భృగు మహర్షి వంశ సంజాతుడైనందున భార్గవ రాముడనియు, గండ్రగొడ్డలిని ఆయుధముగా కలవాడైన పరశురాముడనియు పేరొందెను. అతని గురువు పరమ శివుడు. బ్రహ్మాస్త్రము మొదలైన పెక్కు దివ్యాస్త్రముల ప్రయోగోపసంహరణముల నెరింగి యుండెను.

(అంత శుకమహర్షి నభ్యర్థించి పరీక్షిత్తు దయాసాగరుడైన శ్రీమన్నారాయణుడు దైత్యాంతకుడని జగమెరిగిన సత్యమే కాని విష్ణ్వంశ సంభూతులైన రాజులను సంహరించుటకు కారణమేమియో తెలియజెప్పుమనెను. మునీంద్రుడు పరశురామావతార గాధనిట్లు వినిపింప దొడంగెను)

హైహైవ దేశాధినాధుడైన కార్తవీర్యార్జునుడు రాజలోకమున దేవేంద్రునివలె ప్రఖ్యాతుడు, మహాబలశాలి. భగవదంశచే జనించిన కార్తవీర్యుడు దత్తాత్రేయుని ప్రియ భక్తుడు. ఆస్వామి అనుగ్రహము చేత విశాలమైన సామ్రాజ్యము, శత్రువిజయము కలుగుటయే గాక సహస్ర బాహువులు, అష్ట సిద్ధులు, యశస్సు, మహాబలము, తేజస్సు, ఓజస్సు యోగీశ్వరత్వము కూడ కలిగియుండెను. అతను గాలి వలె తన ఇచ్చవచ్చిన ప్రదేశమునకు పోయి వచ్చుచుండెను. అతనికి పోరాని ప్రదేశము గాని రారాని తావుగాని లేదు.

ఒకనాడా రాజేంద్రుడు యువతులతో గూడి రేవానదికేగి జలక్రీడలాడుచుండెను. అది చూచి అహంకారియైన లంకాధిపతి రావణుడు గిల్లి కజ్జములు పెట్టుకొను మనస్తత్వం కలవాడై, తానూ నదిలో దిగుటకు ప్రయత్నించెను. పది శిరసులు ఇరువది చేతులు ప్రదర్శించెను.



అర్జునుడు తన వేయి చేతులతో నదికి అడ్డుకట్టవేసి ప్రవాహమును నిలిపివేసి పొంగిన నీటిలో రావణుడు మునుగునట్లు చేసెను. లంకేశుడది జూచి సహించలేక కార్తవీర్యునితో పోరునకు సిద్ధపడెను. కార్తవీర్యుడు రావణుని లెక్కచేయక వాని జుట్టుపట్టి గుంజి వానితల మోకాళ్ళకు తాకించి కోతివలె నాడించి తన సైనికుల చేత వానిని చెరలో పెట్టించెను. తరువాత కార్తవీర్యుడు మాహిష్మతీ పురమునకు వచ్చి చెరలోనున్న దశకంఠుని జూచి...

**ఆ॥ వీరునంచు నీవు వెఱ్ఱెత్తి రాకుమా**
**ఊరకుండు మింక ఉలుకులేక**
**కాచినాను తప్పు కరమోడ్చి పొమ్మురా**
**సిగ్గుపడుచు నింక తగ్గియుండు.**



తా॥ ఓరీ రావణా! ఇకమీదట వీరుడిని అంటూ నామీదకు యుద్ధానికి రాకు. ఉలుకులేక ఊరకనే ఉండిపో. ఈసారికి నిన్ను క్షమించి వదిలేస్తున్నాను. చేతులు జోడించి వచ్చిన దారినే పో. సిగ్గుపడి ఇకపై తగ్గియుండు. పోపో.

రావణుడు సిగ్గుతో తలవంచుకుని పోవలసి వచ్చింది.

అటువంటి హైహై వాధీశ్వరుడు దైవాంశ సంభూతుడైనందున స్వతహాగా సజ్జనుడే అయినను దైవ వశమున దారితప్పి సైన్య సమేతుడై ఆకలి దప్పులచే బాధపడుచు జమదగ్ని మహాముని ఆశ్రమము జేరెను. మునికి నమస్కరించి పరిస్థితి వివరించెను. జమదగ్ని చిరునవ్వుతో రాజా విచారించకు నా కామధేనువు మీ అవసరం తీర్చగలదని చెప్పి కామధేనువు అనుగ్రహముచేత రాజపరివారమునకు కావలసిన భోజనము షడ్రసోపేతంగా ఏర్పాటు చేశాడు.



తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టెడి చందమున రాజు **'ఓ మునీంద్రా! ఇటువంటి వరప్రసాదము నావంటి వానివద్దనున్న క్షుద్బాధ అనునది లేనట్లు చేయగలను. నీకు దీనిబదులు వేయి గోవుల నిచ్చెద** ననెను. ముని అది వరప్రసాదమని చెప్పినను వినక బలవంతముగ తన భటులచే పట్టించి తన రాజధానికి తీసికొని పోయెను.

అయ్యో! నా స్వామినుండి నన్ను వేరు చేయకుడు అను విధమున 'అంబే' అని అరచినను దాని మొరవిను వారు లేరైరి. ఈడిగల బదు గోవును బలవంతమున విడువడాయెను.

ఈ సంఘటన జరిగినప్పుడు భార్గవరాముడు ఆశ్రమమున లేదు. రాజు మాహిష్మతీపురమునకు పోయిన పిదప అతను ఆశ్రమమునకేతెంచెను. జరిగిన కథనము విని **''రాజునకింత అహంకారము! మాఇంట విందారగించి, కృతఘ్నుడై మా తండ్రిమాటను కాదని మా గోవునపహరించెనే! నేను రాముడను ఒకడనున్నానని ఎరుంగడో!''** అని మండి పడ్డాడు.

కుటిలుడైన రాజు ప్రవర్తనకు భార్గవరాముడు భరించలేని ఆగ్రహోదగ్రుడైనాడు.

**సీ॥ ప్రళయాగ్ని జ్వాలయై బల్లిదు దదివిని**
**భగభగమంచని మండిపడియె**
**మదకరీంద్రముపైన కుదిరించి లంఘించు**
**మృగరాజువలె దూకె మింటి కెగసి**
**వసుధేశు వెన్నంటి వడిబడి పోరాడ**
**ఘోరయుద్ధమునందు తరిమెవెంట**
**ఆగ్రహోదగ్రుడై అరిభీకరుండైన**
**భార్గవ రాముండు వాడిపెక్కు**

**ఆ॥ ఆయుధముల నంత అరిమూకలన్ పోరె**
**కోలనెత్తివైచె పలు శరముల**
**గండ్రగొడ్డలెత్తి గంభీర స్వరముతో**
**రాచనగరు బెదర రవము బెంచె**

(పోతనగారి "ప్రళయాగ్నిచ్ఛట భంగి..." ఆధారంగా)



తా॥ ఆ విధముగా తనతండ్రి గోవునపహరించి ద్రోహము చేసిన కార్తవీర్యుని కథనం విని, పరశురాముడు యోధాగ్రేసరుడై ప్రళయాగ్ని జ్వాలవలె భగభగమండి పడెను. మృగరాజైన సింహము, మదపుటేనుగుపైకి దూకు చందమున ఆకాశమున కన్నట్లు ఎగిరి దూకెను. మహరాజు వెన్నంటివేగముగా తరిమి పోరాడుదామని వేగముగా బయలుదేరెను. కోపముచే మండిపడుచు శత్రువులకు సింహస్వప్నమైన భార్గవరాముడు వాడిగలిగిన అమ్ములను ఆయుధములను విల్లంబులతోను తన గండ్రగొడ్డలితోను రాచనగరుకు బయలుదేరి శత్రులువణికి పోవునట్లు ధ్వని జేసెను.

అప్పుడు కార్తవీర్యుడు కోపంతో మండిపడుతూ ఇలా అన్నాడు. **"ఈ పిచ్చి బ్రాహ్మణ బాలుడు విప్రుడుండవలసిన పద్ధతిలో లేడు. కొంచెమైనను భయభక్తులు లేక మహాబలోపేతులగు భూపాలురతో కయ్యమునకు కాలు దువ్వుచున్నాడు. మనము వీనిని జంపినను పాపమంటదు.**



**ఇక సహించి ఊరుకొనరాదు. లెండు లెండు బ్రాహ్మణులను జంపుడు".**

అటుపైన తన దండనాధులను ప్రోత్సహించెను. వారును చతురంగ బలములతో పదియేడు అక్షౌహిణుల సేనతో భార్గవరాము నెదిరించి, పోరాడిరి. శర, చక్ర, గదా, ఖడ్గ, బింది పాల, శూలాది ప్రముఖాయుధములను ప్రయోగించి ఆ విప్రుడు కనుగొలుకులలో నిప్పులు రాలుచుండగా రెట్టించిన కోపమున మిట్టిపడి, యజ్ఞోపవీతమును సరిచేసుకొని బొబ్బలు పెట్టి కుఠారమును సారించి ఆ మూకలపై కురికి తొలకరిలో "గ్రొచ్చెలిక" పట్టున చెట్టులను కొట్టు, కృషీవలునివలె పాదములను తెగవేసెను. అరటి బోదెలను నరికివేయు తోటమాలివలె శత్రుమూకల నడుములను ఖండించెను. తాటిచెట్టు నెక్కి తాటిపండ్లను రాల్చు వృక్షారోహకునివలె శత్రు మూకల శిరస్సులను నేలబడగొట్టెను. మృగములను వండుటకు తుండలు తుండలుగా చేయువంటవానివలె శత్రు మూకల అవయవములను చెక్కివేసెను.



అంతటితో తృప్తిచెందక ప్రళయ కాలాగ్నివలె మంటల నుమియుచు విల్లంది కొని పిడుగులు రాల్చు వర్షము కురియు మేఘముల వలె శరవర్షమును కురిపించెను. తన శరపరంపరలను ఘృతంలో శత్రుమూకలను, తన కోపాగ్నికి ఆహుతి చేసెను. తురంగములను అంగ విహీనముల జేసెను. రథములను కూలిపోగొట్టెను. భీతిల్లి పారిపోవు పగతుర సేనను రూపు మాపెను.

అప్పుడు రణరంగమంతయు నెత్తురు, మెదడు, మాంసములతో నిండిపోయెను. భూతములు వానిని తిని మత్తిల్లి ఆనందమున చిందులు వేయసాగెను.

కార్తవీర్యార్జునుడు **"ఓహో! ఈ విప్రబాలకుడు ఒంటి చేత్తో సేనలను నేలకరిపించెనే! వీనినుపేక్షించుట ఇక సమంజసం కాదు. నా భుజబలంతో వీనిని పడగొట్టెదను గాక! అని యనుచు...**

**చం॥ చని తను ఐదువందలగు సంఖ్యను జేరిన**
**బాహు సంపదన్**
**ధనువుల నిల్పి, నారులకు తక్కిన చేతుల**
**వాడి ముల్కులన్**
**అనువుగ బూన్చి, భార్గవుని ఆయుధమున్**
**ఇక రూపుమాపెదన్**
**కనుమని వేసి, బొబ్బలిడె కాలుని కైవడి**
**కార్తవీర్యుడున్.**

(పోతనగారి "ఒక యేనూరుకరంబులన్..." ఆధారంగా)

తా॥ తన ఐదువందల బాహువులతో ఐదువందల కోదండములను తక్కిన ఐదువందల బాహువులతో ఐదువందల బాణములను సంధించి ఒకేసారి ఐదువందల శరములతో ఆ భార్గవరాముని పరశువును ఛేదించెదను చూడుమని అస్త్రములను



వేసి యమునివలె ఆ కార్తవీర్యార్జునుడు పెడబొబ్బలు పెట్టి ఒక్కుమ్మడిగా శరవర్షమును, అతనిపై కురిపించెను. కార్తవీర్యుడు, వేగముగా నడుమనున్న రాజపరి షమండలము మధ్యమున కిరణ కాంతుల ప్రజ్వరిల్లు మార్తాండునివలె దీప్తించెను. ఇట్లతడు శరపరంపర కురిపించు తరుణమున, భార్గవ రాముడును తీసికట్టులేని విధమున అతని నెదుర్కొని ఐదునూర్ల విల్లంబులకు తన ఒకే ఒక విష్ణుచాపముచే అప్రతిహత ప్రత్యుత్తరమొసంగెను. కార్తవీర్యుని ధనువులనన్నింటిని ధ్వంసము జేసెను. తదనంతరమా భార్గవుడు జగద్విఖ్యాతమైనతన కుఠారముతో వాని సహస్రబాహువులను చెట్టు కొమ్మల వలె ఖండించెను.

ఈ విధముగా బాహువుల నన్నింటిని కోల్పోయిన అర్జునుడు శిరస్సు మాత్రము మిగిలిన శైల శిఖరమువలె, ఎర్రని రుధిర ధారల మధ్య తన తల ఎత్తి ఏమి చేయుటకు దిక్కుతోచక కానవచ్చెను. అది జూచి సహించలేక ఆ



పరశురాముడు తన గొడ్డలి నెత్తి మిగిలిన ఆ శిరస్సును ఒక్కవేటున ఖండించెను.

ఈ విధముగా కార్తవీర్యుడు మరణించిన పిదప అతని పుత్రులు పదివేలమంది పరశురాముని ధాటికి తాళలేక పారిపోయిరి. అంత పరశురాముడు దూడతో కూడ తమ ధేనువును గైకొని ఆశ్రమమునకు వచ్చి తండ్రి కొప్పగించి తన పరాక్రమమును తండ్రికి, తోబుట్టువులకు నెరింగించెను.

అదివిని జమదగ్ని కుమారునితో **"నాయనా! వేల్పులందరునూ తమ తమ యంశముల నొసగుట చేతనే ఒక గొప్ప చక్రవర్తి ఉదయించును. అహంభావులైన దేవతలున్నందున చక్రవర్తులకు అహంభావము వెన్నతో పెట్టిన విద్య. మత్సరము పూని నీవా రాజునేల సంహరించితివి? మనకు తాలిమియే(ఓర్పే) ధర్మము,** ప్రధానము. తాలిమి గలవాడే ధన్యుడు. తాలిమి యుంటేనే భగవంతుడు మనలకు బ్రహ్మపదము నేలించును. అదియును గాక....



ఆ॥ కలిగియున్న శమము కలుగును సిరులెల్ల
కలుగ శమము మంచి పలుకు కలుగు
కలుగ శమము సూర్యకాంతి తేజస్వి యౌ
కలుగ శమము హరికి కలుగు కృపయు.

(పోతనగారి "క్షమ కలిగిన..." ఆధారంగా)

తా॥ క్షమ కలిగియుంటే సిరిసంపదలు కలుగుతాయి. క్షమ కలిగియుంటే మంచి మాట అబ్బుతుంది. క్షమ కలిగియున్న వాడికి సూర్యతేజస్సు ఉంటుంది. క్షమ కలిగియున్న వాడికి హరికృప కూడ దొరుకుతుంది.

**"నాయనా! కోపము చేతపట్టపు రాజును చంపి ప్రజలనాథులను జేయుట బ్రాహ్మణుని చంపుట కంటె ఎక్కువ పాపము నొసంగును. ఈ పాపము నశించుటకు నీవు పుణ్య తీర్థములను సేవించవలయును".** అని చెప్పగా భార్గవరాముడు వల్లెయని తండ్రియానతి ననుసరించి ఒక ఏడాదిపాటు దేశమంతయు తిరిగి పుణ్య తీర్థములను సేవించుటకు పోయి తిరిగి వచ్చెను.

ఒకనాడు జమదగ్ని మహాముని భార్యయగు రేణుకతో **గంగానదికి పోయి శీఘ్రముగా నీరము తెమ్ము** అని చెప్పెను. ఆ సాధ్వి మునికోరినట్లే నదికి పోయి చూడగా ఆ నదిలో అప్సరసలతో జలక్రీడలాడుచు సరస సల్లాపములాడుచున్న చిత్రరథుడను గంధర్వు డొకడు కానవచ్చెను. ఆ దృశ్యమును జూచి మైమరచిన రేణుకాదేవి కొంతసేపటి వరకు నిశ్చేష్టయై నిలుచుండి పోయెను. అంతలో ఆమె స్పృహలోనికి వచ్చెను.

**చ॥ హతవిధి! యేమి సేయుదును, ఆహ్నిక వేళయె దోసమాయెనే!**
**పతి నను తూలనాడునని భామ కడుంగడు భీతి జెందుచున్**
**మతి కడు వేద నొంది తను మార్గము బట్టెను ఇల్లు చేరగా**
**సతి మునిజేరి నీరమిడి, సవ్వడి జేయక నిల్చె యొక్కెడన్**



(పోతనగారి "అక్కట! వచ్చి పెద్ద తడవయ్యెను..." ఆధారంగా)

తా॥ "అయ్యయ్యో! నేను వచ్చి చాలా సేపయింది. నా పతి హోమ కార్యమునకు సమయం మించి పోయింది. ఆయన నన్ను నిందించును" అని రేణుకాదేవి భయపడి చాల బాధపడి తన ఇల్లు దారిపట్టింది. ఇల్లు చేరిన ఆమె భర్తకి నీరు అందించి ఒకచోట నిశ్శబ్దంగా నిలుచున్నది.

త్రికాలజ్ఞుడైన జమదగ్ని జరిగిన సంగతి గ్రహించి ఆగ్రహోదగ్రుడై తన కుమారులను పిలిచి మీ తల్లిని సంహరింపుడని ఆనతిచ్చెను. కాని వారట్లు చేయుటకు అంగీకరింపరైరి. భార్గవరాముడు మాత్రం కోపావేశంలో నున్న తమ తండ్రి తమ మాట మన్నించు స్థితిలో లేదని గ్రహించెను. ఆయన ఆనతి తిరస్కరించి శాప తప్తుడయ్యే బదులు ఆయన మాట విని ఆయన అనుగ్రహంతో తల్లిని మరల బ్రతికించుకొనవచ్చని తన తండ్రి ఆమెను సజీవురాలుగ చేయగల సమర్థుడని గ్రహించెను.



వెనువెంటనే నిస్సంకోచముగా తన తల్లి శిరమును తన పరశువుతో ఖండించెను. జమదగ్ని **"బాగు బాగు రామా! తండ్రి ఆనతి తిరస్కరించగల దుర్మార్గులను క్షమించరాదు. నీ సోదరులను కూడ తక్షణమే వధింపుమని** జెప్పెను.

పరశురాముడు క్షణమైన జాగుచేయక పరశువు నెత్తి తన అన్నల శిరములను ఒక్కవేటున ఖండించెను. పరశురాముడు మాతృ హంతకుడని సామాన్యుల కనిపించినను ఆయన బహుబుద్ధిశాలి. ఇంతకంటె ఘోరమైన తప్పిదము చేసిన కార్తవీర్యుని యుద్ధములో తల ఖండించి నందులకే తనని మందలించి, ఆ పాప పరిహారార్థం తనను తీర్థయాత్రలు సేయమన్న జమదగ్ని నేడు చిన్న విలంబనమునకు శిక్షగా తలను ఖండించమను చున్నాడు.

ఇక స్వంత కన్నబిడ్డలనే తల్లిని చంపి మాతృ హంతకుడవమంటున్నాడు. ఇది కేవలం తమ పితృవాక్య



పరిపాలన పరీక్షించుటకే గాని వేరు కాదు. ఆయన ఆజ్ఞ శిరసావహించి ఆనంద పరచి ఆయన అనుగ్రహమున అమ్మను అన్నలను మరుల బ్రతికించుకొంటాను అని భార్గవ రాముడు ఆలోచించి తండ్రి ఆజ్ఞ పాలించాడు.

భార్గవ రాముని పితృ వాక్య పరిపాలనా దీక్షకు ముగ్ధుడైన జమదగ్ని **తొల్లి ఎవ్వడూ చేయని పనిచేసి పితృవాక్య పరిపాలనలో నీకు నీవే సాటి అనిపించు కున్నావు. భళా! రామా! ఏదేని వరం కోరుకో**మన్నాడు. వరంగా తల్లి ప్రాణములను, సోదరుల జీవములను కోరుకొని తన తల్లి రేణుకను, సోదరులను పునర్జీవితులను చేయమని కోరాడు భార్గవరాముడు. సంతోషంగా పుత్రుని కోరిక దీర్చి ప్రాణం ఇవ్వగలిగిన వాడికి మాత్రమే దానిని తీయగల అర్హతుంటుందని నిరూపించాడు జమదగ్ని. (మనబోటి అత్యల్పులు వారి లీలలను చదివి ఏది చేయకూడదో తెలుసుకోవాలి గానీ గొడ్డలి తీసుకొని నేనూ ఒక పరశురాముణ్ణి అవుతాననుకుంటే శ్రీకృష్ణ జన్మస్థానం అంటే జైలుపాలవల్సి ఉంటుంది). ఆ విధంగా

పరశురాముని కంటిన పాపం పరిహారమై పోయింది.

కాలచక్రం గిర్రున తిరుగుతూనే ఉన్నది. పరశురామునికి భయపడి పారిపోయిన రాకుమారులు పదివేలమంది, పగతో రగిలిపోతూ సమయం కోసం వేచియున్నారు. **బ్రాహ్మణుని కోపం పదిరెప్పల పాటు, క్షత్రియుని కోపం చితిలో చేరేదాక** అన్నారు పెద్దలు. జరిగింది భార్గవరాముడు మరచిన అర్జునుని కుమారులు మరువరైరి.

ఒకనాడు రాముడు అన్నలతో అరణ్యమునకు బోయినప్పుడు కార్తవీర్యుని కొడుకులు జమదగ్ని ఆశ్రమము ప్రవేశించి, రెప్పపాటు కాలములో తపోధ్యానములోనున్న జమదగ్నిపై తమ కరవాలములతో బడిరి. కన్నీటితో రేణుక ప్రార్థించినను ఆ పాషండుల హృదయముల కఠిన శిలలై కరుగనే లేదు. జమదగ్ని శిరస్సును ఖండించి వచ్చిన దారినే కాలికి బుద్ధి చెప్పిరి. ఇక రేణుక...



**ఉ॥ ఎంతటి ఘోరమాయెనిక నెవ్విధి జీవము**
**నిల్పుకొందు? నా**
**కింత దురాగతంబు పరమేశ్వరుడేల**
**నొసంగె పుత్రకా?**
**ఇంతి శిరంబు మోదికొని ఏడ్చెను ఇర్వదినొక్క మార్లు**
**నా**
**చెంతకు రార రామ! కదు శీఘ్రమె అమ్మకు**
**దిక్కు నీవెరా.**

(పోతనగారి "జనకుం జంపిన వైనమున్..." ఆధారం)

తా॥ "ఓ పుత్రా! భార్గవరామా! ఎంత ఘోరం జరిగిందిరా నాయనా! ఇంక నేనెలా జీవించను? ఆ భగవంతుడు నాకు ఈ దుష్కర్మ ఎందుకు విధించాడు?" అని రోదిస్తూ ఆ రేణుకాదేవి ఇరువది యొక్క మార్లు తలబాదుకొని రామా! నావద్దకు త్వరగా రారా ఈ అమ్మకు ఇంక నీవే దిక్కు తండ్రీ అన్నది.



అప్పుడు జనదగ్ని కుమారులు తల్లి పెద్ద గొంతుతో ఏడ్వడం లీలగా వినిపించి పరుగు పరుగున ఘటనా స్థలమునకు విచ్చేసిరి. వారుకూడా పరిస్థితి చూచి పసిపాలవలె రోదించిరి.

**"తండ్రీ! మమ్మల్ని చూడనిదే ఇంట్లోంచి కాలు కదిపే వాడివే కాదు. ఎవ్వరికి కించిత్తు అపకారము చేసి యెరుంగవు.ఇట్టి నిన్ను దుర్మార్గులగు రాజనందనులు హత్య గావించిరి కదా! ఇది యెక్కడి అన్యాయము"** అని పలుకుచు భార్గవ రాముని అన్నలు పలు విధముల విలపించిరి.

జరిగినది తలచిన కొలది భార్గవ రాముని ఆగ్రహం ఉప్పెనలా పెల్లుబికింది. ఒక దృఢ నిశ్చయానికి వచ్చి అతడు అన్నలతో ఇలా అన్నాడు.



**చం॥ వలవల యేడ్వనేల నిటు భామలకైవడి**
**అన్నలార! నా**
**పలుకుల నాలకింపరె అపాయము గల్గిన ధైర్య**
**మొక్కడే**
**నిలకడనీయు జుమ్మి! అవనీతలమందున,**
**తండ్రిమేనికిన్**
**సలుపుడు రక్ష, వచ్చెదను చంపి రిపుల్ యము**
**జూడ బంపెదన్.**

(పోతనగారి "ఏడువనేల తండ్రి తను...." ఆధారంగా)

తా॥ ఓ అన్నలారా! ఈ విధంగా స్త్రీలవలె వలవల ఏడ్వడం అనుచితం కదా! నామాట వినండి. ఆపద కలిగినప్పుడు ధైర్యం వహించాలి. ఈలోకంలో అదొక్కటే స్థిరత్వము నిస్తుంది సుమా! మీరు మన తండ్రిగారి శరీరాన్ని కాపాడుతుండండి. నేను మన

శత్రువుల్ని చంపి ఆ యముడి దగ్గరకు పంపించి వస్తాను.

ఆ విధముగా మితిమీరిన కోపముతో పరశురాముడు రౌద్రావతారం గలవాడై పరశువును చేబూని వారున్న పట్టణమునకు బోయి వారి శిరస్సులను ఖండించి కొండలుగా ప్రోగుపెట్టెను. పరశురాముడు అంతటితో ఆగలేదు. తన తండ్రి హంతకులు క్షత్రియులగుటచే రాజు అనువాడు లేకుండా నిర్మూలించెదనని ప్రతిజ్ఞ పట్టి ఇరువది యొక్కమార్లు భూమిని జుట్టివచ్చి కనిపించిన క్షత్రియుడన్న ప్రతి వానిని సంహరించెను. (అప్పటినుండి సర్వ నాశనం జరిగే ప్రక్రియకు 'పరశురామప్రీతి' చేయటం అనే పేరు వచ్చింది)

ఇట్లా పరశురాముడు తన పగదీర్చుకొన్నాడు. రాజుల రక్తముతో శమంత పంచకమను ప్రదేశమున తొమ్మిది మడుగులను గావించెను. ఈ విధముగా



రాజలోకమును శిక్షించిన భార్గవరాముడు తండ్రి తల తెగి పడియున్న ప్రదేశమునకొచ్చెను.

జమదగ్ని శిరస్సును ఆయన మొండెమునకు తగిలించి సర్వదేవమయుడగు దైవమైమ శ్రీహరి తానే అయినందున తన ఆది దైవత్వమునుద్దేశించి గొప్ప యాగము చేసి హోతకు తూర్పును, బ్రహ్మకు దక్షిణమును, అధ్వరునకు పడమటి దిక్కును, ఉద్గాతకు ఉత్తర దిక్కును, మిగిలిన వారికి అవాంతర దిక్కులను కశ్యపునకు మధ్య దేశమును, ఉపద్రష్టకు ఆర్యావర్తమును, సదస్సులకు తక్కిన ప్రదేశములను దానమిచ్చి బ్రహ్మ దేవేరి నదియైన సరస్వతీ నదియందు అవభృత స్నానమాచరించెను. ఆ విధముగ భార్గవరాముడు తన పాపములను ప్రక్షాళణము చేసికొనెను. ఏకవీరాదేవిగా వెలసిన రేణుకాదేవిని భక్తితో పూజిస్తారు. ఒకే ఒక్కడైన వీరుని కన్న ఆ తల్లి భక్తులకు కొంగు బంగారం. అంత ఆ మహానుభావుడు మేఘాచ్ఛాదితుడై వాటినుండి ఆవిష్కరింపబడిన సూర్యభగవానునిని వలె ప్రకాశించెను.



**చం॥ తన సుతుడాప్తుడౌటగద! తాపసి యా జమదగ్ని భూతలిన్**
**తనువున ప్రాణమున్ మరల దాల్చెను అద్భుత పుణ్య ప్రాప్తిచే**
**చెనకొని సప్తమౌనివరశ్రేణిని నిల్చెను ఆకసంబునన్**
**మినుకు మనెన్ నిరంతరము మేలుగ విష్ణుని తండ్రియౌటచే.**

(పోతనగారి "అప్పుడగు పుత్రువలనను..." ఆధారంగా)

తా॥ తపస్వియైన ఆ జమదగ్ని ఈలోకంలో తన కుమారుడు ఆప్తుడయిన కారణంగానే పునర్జీవితుడై అలరారునంత పుణ్యం ప్రాప్తి గలవాడైనాడు. శ్రేష్టులైన సప్త ఋషులలో ఒకడై వెలిశాడు. విష్ణుమూర్తికే తండ్రి అయిన అదృష్టం పొందాడు.



ఆకాశంలో సప్తర్షి మండలంలో ఒక నక్షత్రమై మినుకుమని మెరిశాడు.

పరశురాముడు కూడ చిరంజీవియై తరువాత మనువు కాలమున సప్తఋషి మండలమున ఒకడై వెలుగొందగలడు.

రాజులందరిని సంహరించిన పిదప భార్గవ రాముడు శాంత చిత్తుడై నిస్సంగుడై తనను గంధర్వులు, సిద్ధులు నుతించు చుండగా మహేంద్ర పర్వతముపై తపోదీక్షలో జీవితము గడిపెను. భగవంతుడగు శ్రీహరి ఇట్లు భృగు వంశమున జన్మించి భూభారమును తగ్గించుటకు రాజులనందరినీ వెదకి వెదకి సంహరించెను.

ఆ విధముగా కృతయుగము సమాప్తమై త్రేతాయుగము ప్రవేశించెను. ధర్మ దేవత మూడు పాదములపై సంచరించ నారంభించేను. (యుగ ధర్మములు మారినవి. కాలచక్రము తిరిగి ఆ శ్రీహరి, శ్రీరామచంద్ర మూర్తిగా అవతరించెను).

త్రేతాయుగము నడుస్తున్నది. పరశురాముడు సాత్త్వికుడై మహేంద్రగిరిపై తపస్సు చేసుకుంటున్నాడు. రాజులకు ఆయన భయం పూర్తిగా పోయింది. ఎక్కడో తనదారిన తను తపస్సు చేసుకుంటున్నవాడు తమనేం చేస్తాడని వారు విజృంభించారు. కాని చాలమంది ధార్మికులే అవటం వల్ల మధ్య మధ్య పొరపాట్లు జరిగినప్పటికి జనబాహుళ్యానికి సుఖ శాంతులు లభించాయి. దానితో తృప్తి పడ్డాడు భార్గవ రాముడు.

దశరథ మహారాజుకు రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు పుత్రులుగా ఉదయించారు. ఆయన కాలంలో పరశురామునికి నచ్చని కొన్ని సంఘటనలు జరిగినా, మౌనంగా సహించాడు. ఋష్యశృంగుని ఏమార్చి తన దేశంలో కరువు పోవటానికి తనదేశం తీసుకు రావటానికి దశరథుడు తన తెలివితేటల్ని ఉపయోగించి చతురలయిన స్త్రీలను పంపి ఋష్యశృంగుని అతని తండ్రి ఆనతి లేకుండా తన దేశానికి రప్పించాడు. తన కూతురు శాంత నిచ్చి వివాహం చేసి తన ప్రజల ఇక్కట్లను శాశ్వతంగా



నిర్మూలించాడు. ఇది పరశురాముని కాగ్రహం తెప్పించినా ప్రజాహిత కార్యక్రమమని పైగా ఋష్యశృంగుని తండ్రి కూడా రాజుని మన్నించినందున ఆ భార్గవ రాముడు కూడ మన్నించి యుండవచ్చును.

ఒకనాడు దశరథ మహారాజు వేటకు వెళ్ళాడు. చాలసేపు వేటాడి ఇక విరమించుదామని అనుకొంటుండగా ఏదో జంతువు నీరు త్రాగుతున్న ధ్వని వినిపించింది. దట్టంగా పెరిగిన చెట్లతో అక్కడ ఒక నీటి చెలమ ఉండడం వలన ఏదో మృగం అక్కడ నీళ్ళు త్రాగుతున్నదనుకున్నాడాయన. ఆయనకి ఏమృగమూ కనిపించలేదు. కాని ఆయనకు శబ్దవేది అనే విద్యవచ్చును. దాని సహాయంతో 'బుడుంగ్' అనే ధ్వని వచ్చేచోట ఏదో మృగం నీళ్ళు త్రాగుతోందని అనుకుని ఆ ధ్వని వచ్చినవైపునకు బాణం వదిలాడు. ఘోరం జరిగిపోయింది. శ్రవణుడనే మునికుమారుడు వృద్ధులు, అంధులు అయిన తన తల్లిదండ్రులకి మంచినీరు కోసం అతను పాత్ర ముంచితే నీటిలో వచ్చిన ధ్వని అది.



మునికుమారుడు గాయపడినా రాజుని తన తల్లిదండ్రులకి నీరిచ్చి రక్షించమని చెప్పి మరణించాడు. ధర్మాత్ముడే అయినా విధి ప్రేరితమైన ఘటన అది. శ్రవణుని తల్లిదండ్రులకి నీరిచ్చి తను చేసిన పొరబాటు ఒప్పుకొని అపరాధిలా తలవంచాడు.

**ఉ॥ మత్తిలి క్షత్రియాధములు మానరు దుష్ట స్వభావ**
**మెన్నడున్**
**చిత్తము వచ్చు రీతి సుఖ చింతల భోగములెక్కు**
**డౌటచే**
**ఉత్తములైన వారలకు ఊరక వేదన లిత్తు**
**రీ భువిన్**
**అత్తరి నీవు నా సుతుని అంతము జేసితి**
**వో నృపాలకా!**



తా॥ ఓ రాజాధమా! క్షత్రియులు సుఖలాలసతో వేటవంటి వ్యసనములకు బానిసలై మత్తెక్కి వాళ్ళ ఇష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తూ చెడ్డ స్వభావాన్ని మానుకోరు. అందుచేత నిరపరాధులు మంచి వారికి కూడ దుఃఖం కలిగిస్తారు. అదేవిధంగా నీవు నిరపరాధియైన నా పుత్రుని పొట్టన బెట్టుకున్నావు.

ఈ పాపం ఊరకనే పోదు. నీవు కూడ నీ పుత్రుని కోసం ఆక్రోశిస్తూ మరణించమనే శాపం పొందాడు దశరథుడు. ముని శాపం గురించి విని పరశురాముడు రాజు తప్పిదాన్ని మన్నించాడు. కాలచక్రం తిరుగుతూనే ఉన్నది.

శ్రీరామచంద్రుడు పుట్టి పెరిగి విశ్వామిత్రుని యాగ సంరక్షణకు ఆయన వెంట తమ్ముడు లక్ష్మణునితో పాటు వెళ్ళి రాక్షస సంహారం చేసి మరలి వస్తున్న దారిలో అహల్యా శాపవిమోచన చేసి మిధిలా నగరం చేరాడు.

విశ్వామిత్రుడు పరశురాముని నాయనమ్మకు సోదరుడు అవుతాడు.

విశ్వామిత్రునికి ఆయన శిష్యులకి అతిథి మర్యాదానంతరం తన ఇంట ఉన్న శివధనస్సును చూపించాడు జనక మహారాజు. నూరుగురు యోధులు లాగితే కాని కదలని ఆ దనస్సును ఒక చక్రాల వాహనంపై భద్ర పరచాడాయన. ఆ ధనస్సునకు నారి సంధించి ఎక్కుపెట్టే వానికి తన పుత్రిక సీతనిచ్చి వివాహం చేస్తానని తను ప్రతిజ్ఞ పట్టాడు కాని దురదృష్టవశాన ఆ పని ఎవ్వరి వల్లా కావటం లేదని చెప్పాడాయన. విశ్వామిత్రుడు శ్రీరాముని ప్రయత్నించమని ఆదేశించాడు. తండ్రిమాట గురువులమాట తిరస్కరించని పురుషోత్తముడు శివధనస్సునెత్తటమే గాక దానికి అల్లెత్రాడు బిగిస్తూ ఆ దనస్సును 'ఛళ్ళు'న విరిచాడు. సీత శ్రీరాముని మెడలో వరమాల వేసింది. ఆమె చెల్లెళ్ళు ఊర్మిళ మొదలైన వారికి లక్ష్మణుడు భరత శత్రుఘ్నులు పరిణయమాడారు. దశరధుని ఆనందానికి అవధులు లేవు.



అదేమిటోగాని ఆనందం ఆకాశంలో మబ్బులాగా వస్తూ పోతుంటుంది గాని దుఃఖమే మబ్బులు లేని ఆకాశంలాగా మనిషిని వేదిస్తూనే ఉంటుంది. దశరధుని ఆనందం కూడ క్షణంలో మాయమైపోయింది. ఆకాశం మేఘావృతమై పోయింది. ప్రళయమారుతం భీకరంగా వీచసాగింది. పిడుగులా ఊడి పడ్డాడు భార్గవరాముడు. వస్తూనే హూంకరించాడు. **"ఎవరురా ఈ పవిత్రమైన శివధనుర్భంగం చేసింది. అంత కండకావరం ఏ రాజాధముడి కుందిరా"** అని గర్జించాడు. గడగడ వణికి పోతూ దశరధుడు జనకుడు చేతులు జోడించి భార్గవ రామునికి మ్రొక్కారు.

దశరధుడు **"మహానుభావా! మీ పవిత్ర పాద స్పర్శచే మేము ఈ రాజ్యము పవిత్రులమయ్యాము. నేడు గొప్ప సుదినము. ఈ రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నా పుత్రులు. వీరికి నేడే వివాహం జరిగింది. దైవాంశ సంభూతులు మీ ఆశీర్వచనం వీరికి కావాలి** అని వారిచే భార్గవునికి మ్రొక్కించాడు.



దశరధా! ఈ నక్క వినయం తరువాత చూపు. నేనుండగా వేరొక రాముడుండరాదు. నా ఆరాధ్య దైవమైన శివధనస్సును విరిచిన వానిని నేనూ విరుస్తాను. **ఓరీ దశరథ పుత్రా! నీ వినయం చాలించు. నీవు రాముడివే నటరా...**

**ఉ॥ వాడక తుప్పుపట్టినది పాతది యౌ శివ**
**చాపమున్ భళా!**
**వేడుక ద్రుంచినావటర వెర్రి నృపాలుర మెచ్చి**
**కోలుతో**
**పాడగ నీదు కీర్తనలు బాలక! చూచెదనీ**
**ప్రతాపమున్**
**చూడుము విష్ణు చాపమిది సుంత కదల్పగ**
**లేవు దీనినిన్.**



తా॥ ఒరే పిల్లవాడా! ఈ వెర్రి వెంగళప్పలైన రాజులు నీ స్తోత్రాలు పాడి మెచ్చుకొంటుంటే ఏనాడో వాడక తుప్పు పట్టిపోయిన పాత శివధనస్సు విరిచి గొప్పలు పోతున్నావా? ఏదీ చూస్తాను నీ ప్రతాపం. రా ఇటు, ఈ విష్ణు ధనస్సు అందుకో దీనిని కొద్దిగా కూడ కదల్చలేవు.

భార్గవ రాముని చేతినుంచి విష్ణు చాపమును గైకొన్న శ్రీరాముడు వింటితో పాటు భార్గవరాముని విష్ణుత్వమును కూడ హరించెను. ఆయన 'హరియే' కదా! వివర్ణుడైన భార్గవ రాముడు శ్రీరాముని విష్ణుత్వమునకు నమస్కరించి తనదారిన బోయెను.

మహేంద్ర పర్వతమున తపస్సమాధిలో త్రేతాయుగమునంత గడపివైచెను.

ఇక్కడ ఒక సందేహము పొడచూపును. ఇద్దరు రాములూ విష్ణ్వంశమున ఎట్లుండగలరు? అది సాధ్యమే. వ్యాసభగవానుడు కూడ విష్ణ్వంశమున జనించినవాడే

శ్రీకృష్ణుడును విష్ణుంశమే. ఆమాట కొస్తే అన్ని జీవులూ విష్ణుంశమే కదా!

కాలచక్రము తిరుగుతూనే ఉన్నది. త్రేతాయుగము గడచి ద్వాపర యుగము ప్రవేశించినది. చంద్రవంశ చక్రవర్తియైన శంతన మహారాజు ఒకరోజు వేటకు వెళ్ళి క్రూర మృగాలని సంహరించి "జనావాసాలను" రక్షించే ప్రయత్నంలో ఉన్నాడు. భాగీరదినది ఒక కార్యార్థం స్త్రీ రూపంలో అతనికి దర్శనమిచ్చింది. ఆ కార్యమేమంటే అష్టవసువులు శాపవశాన మానవ జన్మ ఎత్తాలి. వారు గంగను తమకు సహాయం చేయమని అభ్యర్థించారు. గంగ అద్భుత సౌందర్యాన్ని చూచి శంతనుడు ఆమెను తనను పరిణయమాడమని అభ్యర్థించాడు.

ఆమె **"రాజా! నీవు నన్ను ఏనాడూ నిందించరాదు. నన్ను అమర్యాదగా తోసివేయరాదు. ఈ రెంటికీ నీకంగీకారమైతే నాకే అభ్యంతరమూ లేదు"** అన్నది. సంతోషంగా అంగీకరించాడు శంతనుడు.



నెలలు దినములవలె గడచిపోవుచున్నవి. ఒకనాడు గంగ గర్భం ధరించి ఆ సంగతి శంతనుని కెరింగించింది. ఆయన సంతోషమున కవధులు లేవు. ఆమె తన మొదటి శిశువును ప్రసవించింది. కాని విచిత్రంగా ఆమె కలలో నడిచినట్లుగా ఆ శిశువుని ఎత్తుకొని చకచక గంగానదివైపు నడచింది. ఆమెను వెంబడించిన రాజు అప్రతిహతుడై చూస్తుండగానే ఆ శిశువును గంగానదిలో వదలి వేసింది. రాజు మ్రాన్పడిపోయాడు. ఆమె రాజును చిరునవ్వుతో చూస్తూ ఋణం తీరిపోయింది అన్నది.

కాని దైవమాయవలన రాజు ఆ సంగతి పట్టించుకోలేదు. ఈ విధంగా ఏడుగురు శిశువులను ఆమె గంగపాలు చేసింది. ఎనిమిదవ శిశువును ఆమె గంగపాలు చేస్తుంటే రాజు అడ్డుకుని **"ఓ దుర్మార్గురాలా! నీది కన్న కడుపు కాదా. నీది రాతి గుండెయా ఏమి?**



**కం॥ కన్నులు విప్పని కూనను**

**చిన్నారిని చంపుదాన ఛీ! ఛీ! స్త్రీవా?**

**మున్నెరుగమిట్టి తల్లిని**

**కన్నీరే రానిదాన కర్కశవు అహో!**

తా॥ ఈ చిన్నారి శిశువును, కన్నులు కూడ విప్పని పాపాయిని చంపు దుర్మార్గురాలా! ఛీ ఛీ నీవు ఆడు దానివేనా? ఇటువంటి 'మాతృమూర్తి' గురించి ఎన్నడూ కనీవినీ ఎరుగమే! ఓహో! కన్నీరంటే ఎరుగని నీవుఎంత కఠినాత్మురాలవే!

శిశువును నదిలోకి విసిరేయబోతున్న ఆమె చటుక్కున ఆగిపోయి, "రాజా! నువ్వు ఇద్దరికి అపకారం చేశావు. నియమోల్లంఘన చేసి మన బంధం తెంచివేసి నాకన్యాయం చేశావు. ఈ ఎనిమిదవ 'వసువు' కు శాప విముక్తిలేక భూలోకంలో జీవించే దుర్గతి పట్టించావు. శాపగ్రస్తులైన ఎనిమిది మంది వసువులకు నేను భాగీరధిని. ముక్తి కలిగించడానికి నన్నాశ్రయించారు.



వారు మనకి బిడ్డలుగా పుట్టారు. ఏడుగురిని గంగపాలు చేసి ముక్తి ప్రసాదించాను. ఎనిమిదవ వానికి నీవు అడ్డుపడ్డావు. వీడిని **"దేవవ్రతుడు"** అను పేరుతో నీవు పెంచుకో. వీడు నీకు అఖండ కీర్తి తెచ్చే కొడుకవుతాడు. వీనిని నావెంట తీసుకొని వెళ్ళి 'పరశురాముని' వద్ద శస్త్రాస్త్ర విద్యలన్నీ నేర్పించి నీకు ఒప్పగించమని ఆయన నభ్యర్థిస్తాను అని గాంగేయుణ్ణి పరశురాముని కొప్పగించింది. ఇక, ఆయన అతనిని గురువును మించిన శిష్యుడుగా చేశాడు.

ఆ తరువాత శంతనుడు, సత్యవతి అను మత్స్య కన్యను వివాహమాడాలనుకోవడం, ఆమె తండ్రిని ఒప్పించటానికి గాంగేయుడు ఆమె సంతతికి రాజ్యాధికారం లభించడం కోసం తమ ఆజన్మాంతం కఠోర బ్రహ్మచర్య దీక్ష వహిస్తానని 'భీష్మ' ప్రతిజ్ఞ చేసి భీష్ముడవటం జరుగుతుంది. సత్యవతికి విచిత్ర వీర్యుడు పుత్రుడు. అతని వివాహానికి కాశీరాజు కన్యలు అంబ, అంబిక, అంబాలికలను బలవంతాన ఎత్తుకొని వస్తాడు భీష్ముడు.

వ్యసన పరుడైన తన తమ్ముని స్వయం వరానికి పిలువనందుకు ఆ విధంగా ప్రతీకారం తీర్చుకొన్నాడు. కాని అతను దయార్ద్ర హృదయుడు.

అంబ తన మనసు సాల్వ మహారాజు కర్పించాననగానే ఆమెను సాల్వుని వద్దకు పంపివేశాడు. కాని పరాయివాడు ఎత్తుకెళ్ళిన స్త్రీని పెళ్ళాడే అగత్యం తనకు పట్టలేదన్నాడు సాల్వుడు. అంబ భీష్మునే తనని వివాహమాడమన్నది. తను ప్రతిజ్ఞా బద్ధుడనన్నాడు గాంగేయుడు. రెంటికీ చెడ్డ రేవడి అయిందామె బ్రతుకు.

చేసేదిలేక ఆమె భీష్ముని గురుదేవుడైన పరశురాముని ఆశ్రయించి తనగోడు విన్నవించుకొన్నది. ఆయన నేను భీష్మునొప్పిస్తానని ముందుకు వచ్చి భీష్ముని అంబని వివాహ మాడమన్నాడు.

**గురువర్యా! నేను ప్రతిజ్ఞా బద్ధుడను. వివాహం ఆడలేనన్నాడు.** వరాలిస్తానన్నాడు భార్గవుడు. ససేమిరా అన్నాడు శిష్యుడు. తనకు శత్రువైపోతావని బెదిరించాడు



భార్గవుడు. అసాధ్యమన్నాడు భీష్ముడు. సామ, దాన, భేదోపాయములు విఫలమైనందున దండోపాయం తప్పలేదు. భీష్మునితో ద్వంద్వ యుద్ధానికి దిగాడు భార్గవరాముడు. శస్త్రాన్ని శస్త్రంతోను, అస్త్రాన్ని అస్త్రంతోను ఎదుర్కొన్నాడు భీష్ముడు.

పరశురాముడు భీష్ముని ఓడించలేక గంగాదేవి పుత్రుడైన భీష్ముని పక్షాన న్యాయమున్నదని గ్రహించి...

**చం॥ అతివ! శమింపు మమ్మ! నను, అందరి బోలిన వాడుకాడు, ఈ**
**ధృతమతి శాంతనుండు, ధర ధీరత వీనికి వీడె సాటియా**
**ఇతనికి ధర్మముల్ నిలిచె యేర్పడి తోడుగ నాదు మాటలన్**
**మతిగొని పంతమున్ విడచి మానిని! వేరొక భర్తనెంచుమా**



తా॥ ఓ అంబా! నన్ను క్షమించవమ్మా! ఈ భీష్ముడు అందరి వంటివాడు కాదు. ధీరత్వము ధర&మ పరాయణత్వము కలవాడు. వీనికి ధర్మదేవత తోడుండడం వల్ల నా శక్తి పని చేయుటలేదు. నామాట విని పంతం మాని ఇంకొక జీవిత భాగస్వామినెంచుకో.

ఈ విధంగా మర్యాద పూర్వకంగా తప్పుకొన్నాడు భార్గవరాముడు.

వగతీర్చుకోవాలని 'అంబ' శిఖండిలా అవతరించటం, విచిత్ర వీర్యునికి అంబిక, అంబాలికలతో వివాహం కావటం, అతను కాలం చేయటం, సత్యవతి తనకు పరాశరుని వలన జన్మించిన వ్యాసుని వలన పుత్రులను కనమని ప్రోత్సహించడం అంబికకు ధృతరాష్ట్రుడు జన్మించడం అంబాలికకు పాండురాజు జనించడం, వారి బదులు వ్యాసుని వద్దకు 'పరిచారికను' పంపగా విదురుడు జన్మించడం జరిగింది.



పుట్టుగుడ్డి ధృతరాష్ట్రునికి నూర్గురు దుర్యోధన దుశ్శాసనాది కౌరవులు జన్మించారు. పాండురాజు కుంతిని మాద్రిని వివాహం చేసుకున్నాడు. ఆ మహావీరుడు కురు సామ్రాజ్యాన్ని అజేయంగా విస్తరింపచేశాడు. అతను శాపగ్రస్తుడైనందున తనకు లభించిన మంత్ర ప్రసాదంగా పాండురాజు అనుమతితో ధర్మరాజు, భీముడు, అర్జునుని కన్నది. మాద్రి కూడ అదే మంత్ర సహాయంతో నకుల సహదేవులను కన్నది. కుంతి తను కన్యగా ఉన్నప్పుడే ఆ మంత్ర మహిమను పరీక్షించెదనని తలచి సూర్యభగవానుని ఆహ్వానించి దైవికంగా కర్ణునికి తల్లి అయింది. సంఘనిందకు వెఱచి ఆ బాలుని ఒక తెప్పలో ఉంచి నదిలో వదలి వేసింది. ఆ తెప్ప ఒక సుతునికి దొరికి అతని భార్య రాధచే పెంచబడి కౌంతేయుడు రాధేయుడయ్యాడు.

ద్రోణాచార్యుని వద్ద క్షేత్రవిద్యలు నేర్చారు కౌరవ పాండవులు. అర్జునుణ్ణి అందరికన్నా మేటి విలుకానిని చేస్తానని మాట ఇచ్చాడు ద్రోణుడు. సహజ కవచ

కుండలాలతో జన్మించిన కర్ణునికి విలువిద్య కూడ సహజంగానే వచ్చింది. అతన్ని సమయానికి తనవైపు త్రిప్పుకొని అంగరాజుని చేసి అర్జునునికి ప్రత్యర్థిగా తయారు చేశాడు, ధుర్యోధనుడు. విధి ఆడించిన వింత నాటకం వల్ల ఏకగర్భ జనితులు కర్ణార్జునులు బద్ధ శత్రువులయ్యారు. అది చూచి విలవిల లాడింది కుంతి.

దుర్యోధనుడి ప్రేరేపణతో బ్రహ్మాస్త్రం కోసం ప్రయత్నించసాగాడు కర్ణుడు. అర్జునుడికి బ్రహ్మాస్త్రం ఉన్నది. ద్రోణుడు నేర్పడు. బ్రహాస్త్రం ఉంటేగాని కర్ణుడు అర్జునునితో తలపడలేడు. అందుకని కర్ణుని బ్రహ్మాస్త్రంకోసం పరశురాముని ఆశ్రయించమన్నాడు దుర్యోధనుడు. ఆయన బ్రాహ్మణ క్షత్రియులకు తప్ప అన్యులకు అందులోను ఆత్మ సంరక్షణార్ధం వాడితేనే బ్రహ్మాస్త్రం ఉపదేశిస్తాడు భార్గవరాముడు.

కర్ణుడు తను సూతుడనని చెబితే జమదగ్ని శిష్యునిగా చేర్చుకోడు. దుర్యోధునుని ప్రోద్భలంతో సూర్యనందనుడు



దుష్ట చతుష్టయంలో ఒకడై అబద్ధమాడి భార్గవరాముని శిష్యునిగా చేరాడు.

తె॥ రాగితో కలియుట చేత, వీగి కాలి
తినును సమ్మెట దెబ్బలు కనక మిలను
చేరి 'దుష్ట చతుష్టయ' శ్రేణియందు
సూర్యనందనుడును చెడె శోభ తరిగి.

తా॥ మంచి వాడైన చెడ్డవానితో కలిసి జీవిస్తే తప్పకుండా చెడ్డవాడవుతాడు, నష్టపోతాడు. మేలిమి బంగారం కూడ అల్పమైన రాగితో కలియుటచేత స్వచ్ఛమైన బంగారం కొలిమిలో కాలిపోయి సుత్తిదెబ్బలు తింటుంది. సూర్యుడంతటి వాడికొడుకైన దానకర్ణుడు దుష్టచతుష్టయం వరునలోచేరి, శోభను కోల్పోయాడు. (శాపగ్రస్తుడయ్యాడు).

సూర్యతేజస్సుతో సహజ కవచకుండలాలతో (కవచమంటే లోహంతో చేసింది కాదు. రక్షించేది అని అర్ధం. కర్ణునికి



చెవి కుండలాలు, కవచమంటిగట్టి శరీరం పుట్టుకతో సూర్యుని అనుగ్రహం వల్ల వచ్చాయి) అతన్ని చూసి సూతుడని అనుమానం కూడ రాలేదు. అతను స్వచ్ఛమైన బ్రాహ్మణుడనుకొన్నాడు. నమ్మాడు భార్గవరాముడు. (కర్ణుడు సూర్యనందనుడు కదా).

తనకి అస్త్ర విద్య నేర్పమని అభ్యర్ధించిన కర్ణుని విన్నపం విన్నాడు పరశురాముడు. కాలం గడుస్తున్నకొద్దీ కర్ణుని శ్రద్ధాసక్తులు వినయము భార్గవరాముని ముగ్ధుణ్ణి చేశాయి. అస్త్రవిద్యలో ఆరితేరాడు కర్ణుడు.

ఒక శుభముహూర్తమున ఆయన కర్ణునికి అనుకున్నట్లుగానే బ్రహ్మాస్త్రమును మంత్రోక్తంగా అందించాడు. అనుకున్న కోరిక నెరవేరింది. కర్ణుని ఆనందానికి అవధుల్లేవు. భార్గవరాముడు కూడ ఆరోజు తీవ్రంగా అలిసిపోయాడు. ఆయన కర్ణుని ఒడిలో తలపెట్టుకుని నిదురించసాగాడు. జరుగుతున్నదంతా ఒక



కంట గమనిస్తూనే వున్నాడు దేవేంద్రుడు. ఆయనకు ఆరాటమధికమయింది. ఈ బ్రహ్మాస్త్రంతో తన బిడ్డ అర్జునునికి ముప్పు తప్పదు. సహజ కవచ కుండలాలతో అజేయుడైన వీడు బ్రహ్మాస్త్రంతో అర్జునుని తేలికగా అంతం చేస్తాడు. ఏదో చేయాలి.

వెంటనే దేవేంద్రుడు ఒక కందిరీగవలె మారిపోయి కర్ణుని తొడతీవ్రంగా కొరకటం మొదలుపెట్టాడు. రక్తం వస్తున్నది. బాధ కలుగుతున్నది. కాని తను కదిలితే గురువుగారికి నిద్ర చెడిపోతుంది. అందుకని బాధ సహించి కదలక మెదలక కూర్చున్నాడు కర్ణుడు. రక్తం మడుగువలె పారి భార్గవరాముని తల తడిసిపోయింది. ఉలికిపడి లేచి, జరిగినది చూచి నిర్ఘాంతపోయాడాయన. చివరకు తేరుకొని జరిగింది గ్రహించాడాయన. ఆశ్చర్యంతో ఇలా అన్నాడు.

**శా॥ ధీరోదాత్తులు శత్రుమూకలొకటై దీప్తించి**

**పోరాడినన్**

**వీరుండై ఒకచేత గెల్చు ఘనుడున్ బెంబేలు**

**జెందేను బో**

**కారే రక్తము నింత జూడయరరే! గంగా ప్రవాహం**

**బయెన్**

**ఔరా! యీతడు బాపడౌట నిజమా! ఆశ్చర్యమే**

**మెండయెన్.**

తా॥ ఒంటిచేత్తో శత్రువును ఓడించి బెంబేలెత్తించగల ధైర్యశాలి కూడా గంగా ప్రవాహంలా కారుతున్న ఇంత రక్తం చూచి నిశ్చేష్టులై పోతారే! ఔరా! ఇతడు బ్రాహ్మణ యువకుడంటే నమ్మశక్యంగా లేదు. ఎంతో ఆశ్చర్యం గలుగుతోంది.



తరువాత భార్గరావుడు దివ్య దృష్టితో కర్ణుడు, దుర్యోధనుని మాయోపాయం వల్ల అబద్ధమాడి తనకు శిష్యుడుగా చేరాడని గ్రహించాడు. కోపంతో రగిలిపోయాడాయన. ఒకప్పుడైతే పరశువుతో తలనరికే వాడే గాని భార్గవరాముడు తన ఆవేశం తగ్గించుకొన్న బ్రహ్మజ్ఞాని ఇప్పుడు. కర్ణుని ఉద్దేశ్యం చెడగొడితే చాలని **ఓరీ కర్ణ! నీవు కావాలనుకొన్నప్పుడు ఈ మంత్రం నీకు గుర్తురాకుండా పోవుగాక!** అని శపించాడు. ఆవిధంగా భార్గవరాముని శాపం వలన భారత యుద్ధంలో ధర్మం గెలిచి అధర్మం ఓడిపోయింది. ఇక దుష్ట సంహార కార్యక్రమం శ్రీకృష్ణ పరమాత్మ చూసుకొంటాడని భార్గవరాముడు తపస్సమాధిలో మునిగిపోయాడు.

కలియుగము ఆవిర్భవించింది. రకరకములైన మార్పులొచ్చాయి. ద్వాపర యుగంలో రాక్షసులు దుష్టరాజులై జన్మిస్తే శ్రీకృష్ణపరమాత్మ భారతయుద్ధం సృష్టించి కీచకులవంటి దుర్మార్గులనంతం చేశాడు. త్రేతాయుగంలో వీరే రాక్షసులు.



కలియుగంలో వీరు మొదట్లో చిన్న చిన్న సంస్థానాలకి రాజులుగా జన్మించి ఐశ్వర్య మదంతో స్త్రీ వ్యసనంతో అకృత్యాలు చేశారు. నారాయణుడే వేంకటేశ్వరుడై ప్రజలకు కోరికలు తీర్చి భక్తి కలిగించి సన్మార్గంలో ఉంచాడు. బుద్ధుడై జన్మించి అహింస, సత్యం, ధర్మం బోధించి దుర్మార్గం తగ్గించాడు. కలియుగం నడుస్తూ యాంత్రిక యుగం వచ్చింది. ఆ దుర్మార్గులైన రాజులు, జమిందారులై పుట్టారు. వాళ్ళకు తోచిన చెడు వాళ్ళు చేశారు. రకరకాల సద్గురువుల రూపంలో మత ప్రవక్తల రూపంలో వారిని మార్చాలని ప్రయత్నించాడు పరమాత్మ. ఇప్పుడు యాంత్రిక యుగం కూడపోయి కంప్యూటర్ యుగం వచ్చేసింది. జమిందారులంతా డబ్బు పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులుగాను ఆనాటి సైన్యాధిపతులు నేటి రౌడీ బాబాయిలుగాను పుట్టారేమో అనిపిస్తున్నది.



సామాన్యమానవుడు ఏ యుగంలోనైనా సామాన్యుడే. ఆ బడుగుజీవి "ఓ పరమాత్మా! రావయ్యా రక్షించవయ్య" అని ఆక్రోశిస్తూనే ఉన్నాడు. మహేంద్ర పర్వతం మీద తపస్సు చేసుకుంటున్న ఆ భార్గవరాముడు మన మొర వింటాడా ఈసారి కల్కిరూపంలో వస్తాడా!

ఏమో! ఏమో! ఏమో

నేను కోరుకోగలిగింది ఒక్కటే...

సర్వేజనాః సుఖినోభవన్తు